# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం-28- జూన్ - 2025 | సంపుటి : 3 | సంచిక : 32 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# రైతుల కోసం న్యాయపోరాటం

- కృష్ణా గోదావరి నది జలాలలో న్యాయం జరిగే వరకు పోరాడుతున్నాం
- ఇరిగేషన్ శాఖ పై గత పాలకుల నిర్లక్ష్యం
- ఫలితంగా ఏడాదికి రూ.16 వేల కోట్ల మిత్తి చెల్లింపులు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కృష్ణ, గోదావరి జలాల పంపకంలో గత పాలకుల అశ్రద్ధ వల్ల తెలంగాణ రైతాంగానికి అన్యాయం జరిగిందని, దానిని సరి చేసేందుకు తాము పోరాడుతున్నామని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పాలకీడు మండలం పాలకీడు మండలం జానపాడు గ్రామంలో కృష్ణ నది పై నిర్మిస్తున్న జవహర్ జానపాడు లిఫ్ట్ ఇరిగేషన్,బెట్టేతండా గ్రామంలో మూసీనది పైన నిర్మిస్తున్న బెట్టేతండ స్కీం పనులను ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పాలకులు పదేళ్ల నిర్లక్ష్యం చేయటంతో కృష్ణ నదిలో 811 టి యమ్ సి లలో ఆంధ్ర కి 599 టి యమ్ సి లు, తెలంగాణాకి 299 టి యమ్ సి లకి వ్రాత పూర్వకంగా ఒప్పుకున్నారని.. కానీ, తాము వచ్చాక నది పరివాహక ప్రాంతం,ఆయకట్టు, జనాభా ను పరిగణనలోకి తీసుకొని నీటి కేటాయింపులు చేయాలనీ పోరాడుతున్నామని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మడి హట్టి వద్ద 38000 కోట్లతో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ ని ప్రారంభిస్తే.. కమీషనలకి కక్కుర్తి పడి లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం పేరుతో నిర్మిస్తే..

మిగతా 2లో..



# ఆ నీటిని ఉపయోగించకండి

## మాదాపూర్ సున్నం చెరువు పరిసరాల్లో భూగర్భ జలాలు అత్యంత కలుషితం

## హెచ్చరించిన హైడ్రా



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

భాగ్యనగరంలో 6 చెరువులకు పునరుజ్జీవం కల్పించడం కోసం కృషిచేస్తున్న హైడ్రా, ఆ నీటి వనరుల సమీపంలోని భూగర్భజలాలపై దృష్టిసారించింది. అందులో భాగంగా తొలి ప్రాధాన్యంగా మాదాపూర్ సున్నంచెరువును ఎంపిక చేసుకున్న హైడ్రా, అక్కడి పరిసరాల్లోని భూగర్భజలాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని తేల్చింది.

మిగతా 2లో..

# ఇదేమన్న డైలీ సీరియలా..

- ఫోన్ ట్యాపింగ్‌లో గాడిద గుడ్డు తప్ప చర్యలు ఉండవు
- ఆధారాలు ఇచ్చే వాళ్లను పక్కన పెట్టి డైలీ సీరియల్ నడుపుతున్నారని విమర్శలు
- ఎంపీ రఘునందన్



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

దుబ్బాక ఉప ఎన్నికలతోనే ఫోన్ ట్యాపింగ్ ప్రారంభమైందని.. మొట్ట మొదటిసారిగా తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని డీజీపీకి అనేక సార్లు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధంలేని కాంగ్రెస్ నాయకులను సిట్ పిలుస్తోందని.. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ అయ్యింది తన దన్నారు. మమ్మల్ని అడిగితే అన్ని వివరాలు ఇచ్చే వాళ్ళమన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో గాడిద గుడ్డు తప్ప చర్యలు ఉండవని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మూలాఖత్ అయ్యాయని విమర్శించారు. ఫిర్యాదు చేసిన తమను సిట్ ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు.

మిగతా 2లో..

# మావోయిస్టుల లేఖపై స్పందించిన సీతక్క

- నా మూలాలను మరిచిపోలేదు
- ఆదివాసీల జోలికి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం
- ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ

2లో..





# టీజీ ఎప్‌సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బీటెక్ సీట్ల భర్తీకి సంబంధించిన ఎప్‌సెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేశారు. పాత ఫీజుల ప్రకారమే కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. మొత్తం మూడు దశల్లో బీటెక్ సీట్లను భర్తీ చేయనున్నారు. మొదటి విడుత కౌన్సెలింగ్ జూన్ 28 నుంచి ప్రారంభం కానుంది.

### తొలి విడుత కౌన్సెలింగ్ షెడ్యూల్

- సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్ - జూన్ 28 నుంచి జులై 7 వరకు
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ - జులై 1 నుంచి 8 వరకు
- వెబ్ ఆప్షన్ల నమోదు - జులై 6 నుంచి 10 వరకు
- ఫ్రీజింగ్ ఆప్షన్స్ - జులై 10
- ఫస్ట్ ఫేజ్ సీట్ అలాట్‌మెంట్ - జులై 18
- ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు, సెల్ఫ్ రిపోర్టింగ్ - జులై 18 నుంచి 22 వరకు

### సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్..

- సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్(ఫస్ట్ ఫేజ్‌లో నమోదు చేసుకోని వారికి మాత్రమే) - జులై 25
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ - జులై 26
- వెబ్ ఆప్షన్ల నమోదు - జులై 26 నుంచి 27 వరకు
- ఫ్రీజింగ్ ఆప్షన్స్ - జులై 27
- సెకండ్ ఫేజ్ సీట్ అలాట్‌మెంట్ - జులై 30
- ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు, సెల్ఫ్ రిపోర్టింగ్ - జులై 30 నుంచి ఆగస్టు 1 వరకు
- ఫిజికల్‌గా రిపోర్ట్ చేసేందుకు - జులై 31 నుంచి ఆగస్టు 2 వరకు

### ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్..

- సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్ (ఫస్ట్, సెకండ్ ఫేజ్‌లో నమోదు చేసుకోని వారు మాత్రమే) - ఆగస్టు 5
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ - ఆగస్టు 6
- వెబ్ ఆప్షన్ల నమోదు - ఆగస్టు6 నుంచి 7 వరకు
- ఫ్రీజింగ్ ఆప్షన్స్ - ఆగస్టు 7
- సీట్ అలాట్‌మెంట్ - ఆగస్టు 10
- ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు, సెల్ఫ్ రిపోర్టింగ్ - ఆగస్టు 10 నుంచి 12 వరకు
- ఫిజికల్‌గా రిపోర్ట్ చేసేందుకు - ఆగస్టు 11 నుంచి 13 వరకు

# రూ.350 కోట్ల భూ కేటాయింపులు రద్దు చేసిన హైకోర్టు

- ఐఏఎంసీకి భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు
- ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్‌కు భూకేటాయింపులు రద్దు చేసిన హైకోర్టు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్‌కు చేసిన భూకేటాయింపులను హైకోర్టు రద్దు చేసింది. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని సర్వే నంబర్? 83/1లో మూడున్నర ఎకరాలకు పైగా భూమికి కేటాయిస్తూ జారీ చేసిన జీవోను న్యాయస్థానం కొట్టేసింది. ఐఏఎంసీకి భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ రెండు వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

మిగతా 2లో..

# బనకచర్లపై రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



బనకచర్లపై పీపీటీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ.. డైవర్షన్ కోసమే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని మండిపడ్డారు. 2016 ఎజెండా మినిట్స్‌పై రేవంత్ రెడ్డితో చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని..

మిగతా 2లో..

# భర్తలను భార్యలే హత్య చేస్తున్నారు

- వివాహేతర సంబంధాల వల్లే దారుణాలు జరుగుతున్నాయన్న వీహెచ్
- కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని ప్రజలకు పిలుపు
- తల్లిదండ్రులను, భర్తలను చంపొద్దని హితవు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సమాజంలో కుటుంబ బంధాలు దెబ్బ తింటున్నాయని, ఒకప్పుడు భర్త క్షేమాన్ని కోరుకున్న భార్యలే ఇప్పుడు వారి ప్రాణాలు తీస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో వివాహేతర సంబంధాల మోజులో పడి భర్తలను హత్య చేస్తున్న ఘటనలు పెరిగిపోవడంపై ఆయన ఆందోళన చెందారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పూర్వకాలంలో భార్యలు... తమ భర్తలను కాపాడాలని దేవుళ్లను ప్రార్థించేవారని, కానీ నేటి పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయని వీహెచ్ అన్నారు.

మిగతా 2లో..

# రేపు నిజామాబాద్‌కు అమిత్ షా రాక

- పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనున్న కేంద్ర మంత్రి
- 29న మధ్యాహ్నం 1 గంటకు బేగంపేట విమానాశ్రయానికి రాక
- అక్కడి నుంచి నేరుగా నిజామాబాద్ పర్యటనకు పయనం
- అమిత్ షా పర్యటన కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్న బీజేపీ శ్రేణులు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నిజామాబాద్ జిల్లా రైతులు ఎప్పుడెప్పుడని ఎదురు చూస్తున్న పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఈ కార్యాలయం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమం కోసం ఆయన రేపు నిజామాబాద్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి బీజేపీ వర్గాలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. కేంద్ర మంత్రి అమిత్ షా రేపు మధ్యాహ్నం 1 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఆయన నేరుగా నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన పసుపు బోర్డు ప్రధాన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. జిల్లా రైతుల చిరకాల డిమాండ్‌గా ఉన్న పసుపు బోర్డు కార్యాలయాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఆ నీటిని ఉపయోగించకండి

(మొదటి పేజీ తరువాయి)

కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉపరితల నీటితో పాటు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి నమూనాలు పరీక్షించారు. ఆ పరిశోధనలో ట్యాంకర్ల లోని నీటి నమూనాల్లో సీసం, కాడ్మియం, నికెల్ వంటి భారలోహాలు మోతాదుకు మించి ఉన్నట్లు తేలింది. అవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) హెచ్చరించింది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఉండాల్సిన మోతాదు కంటే రెండు, మూడిరతలు, 12 రెట్లు అధికంగా ఉండి ప్రజల ప్రాణాలను హరిస్తున్నట్లు పీసీబీ వివరించింది. సున్నంచెరువు చెంత ఏళ్ల తరబడి కొందరు బోరుబావులు తవ్వి, ఆ నీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మాదాపూర్ పరిసరాల్లోని హాస్టళ్లు, విద్యాసంస్థలు, హోటళ్లు, కాలనీలకు ప్రతి వేసవిలో పెద్దఎత్తున నీటిని సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నీరంతా అత్యంత ప్రమాదకరమని, పీసీబీ గుర్తించినట్లు వెల్లడిరచిన హైడ్రా, స్థానిక ప్రజలు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులు, ఉద్యోగులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని వినియోగించవద్దని సూచించింది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక లీటరు నీటిలో 0.01 మిల్లీగ్రాముల సీసం వరకూ ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదని, కానీ సున్నం చెరువు చుట్టూ ఉన్న బోరు నీటిలో 0.073 0.122 ఉన్నట్లు పీసీబీ గుర్తించింది. నిర్దిష్ట ప్రమాణాల కంటే 7 నుంచి 12 రెట్లు అధికంగా సీసం ఉన్నట్లు తేల్చింది. ఆ నీరుతాగితే చిన్నారుల మెదడు చురుకుదనంపై ప్రభావం చూపుతుందని, జ్ఞాపిక శక్తి తగ్గడం, రక్తహీనత, బాల్యం, యవ్వన దశలో కిడ్నీలపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, సంతానోత్పత్తిపైనా ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారని వివరించారు. 2 నుంచి 3 రెట్లు అధికంగా కాడ్మియం, 2 రెట్లు అధికంగా నికెల్ ఉన్నట్లు గుర్తించారు. ఆ నీటిని మరగబెట్టి వినియోగించినా ప్రయోజనం ఉండదని వైద్యులు సూచిస్తున్నారని హైడ్రా హెచ్చరించింది. అందులో ఉండే సూక్ష్మక్రిములు నశించినా భారలోహాలు కరగపోగా మరింత ప్రమాదకరంగా పరిణమిస్తాయని హెచ్చరించింది.

# రూ.350 కోట్ల భూ కేటాయింపులు రద్దు చేసిన హైకోర్టు



(మొదటి పేజీ తరువాయి)

న్యాయవాది కె.రఘునాథ్ రావు, వెంకట రామ్‌రెడ్డి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్లపై జనవరిలోనే వాదనలు ముగిశాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ సంస్థకు భూకేయింపు చేశారని న్యాయవాది రఘునాథ్ రావు కోర్టుకు తెలిపారు. ఐటీ కారిడార్‌లో రూ.350 కోట్ల విలువ చేసే భూమిని సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా కేటాయించారని వాదించారు. ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే పలు అంతర్జాతీయ సంస్థల మధ్య వివాదాల పరిష్కారానికి దోహదపడుతుందని అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరించారు. ఇలాంటి వివాదాలు కేవలం న్యాయస్థానాల్లోనే కాకుండా బయట కూడా చేసుకోవచ్చని న్యాయస్థానాలే చెబుతున్నాయని ఐఏఎంసీ వల్ల వివాదాలు పరిష్కారమైతే కోర్టులపై కూడా భారం తగ్గుతుందన్నారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో జనవరిలో తీర్పును రిజర్వు చేసిన హైకోర్టు, శుక్రవారం తీర్పును వెలువరించింది. ఐఏఎంసీ భూకేటాయింపుతో పాటు ప్రస్తుత భవనానికి నిర్వహణ కోసం జారీ చేసిన జీవోలను కూడా హైకోర్టు కొట్టేసింది.

# ఇదేమన్న డైలీ సీరియలా..



(మొదటి పేజీ తరువాయి)

రోజుకు ఒక్కరిని మాత్రమే విచారణ చేయడానికి ఇదేమైనా డైలీ సీరియలా అని ప్రశ్నించారు. ఆధారాలు ఇచ్చే వాళ్లను పక్కన పెట్టి డైలీ సీరియల్ నడుపుతున్నారని విమర్శలు గుప్పించారు.ాంగ్రెస్ పార్టీకి ప్రచార ఆర్భాటాలు తప్ప మరొక్కటి లేదని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. బెదిరింపు కాల్స్‌పై విచారణ జరుగుతుందని పోలీస్ ఉన్నతాధికారులు చెప్పారని తెలిపారు. నియోజకవర్గానికి వెళ్లినప్పుడు సమాచారం ఇస్తే ఎస్కార్ట్, ముగ్గురు సిబ్బందిని ఇస్తామన్నారన్నారు. కాంగ్రెస్ 18 మాసాల పాలనపై సమీక్షించుకోకుండా రోజుకొక కొత్త కథతో ముందుకు వస్తోందని మండిపడ్డారు. జీహెచ్‌ఎంసీ మేయర్ ఐదు రూపాయల భోజనం పేరు మారుస్తున్నట్లు ప్రకటించారని.. అన్నపూర్ణ క్యాంటీన్ పేర్లను ఇందిరమ్మ పేరు పెట్టడం దౌర్భాగ్యమన్నారు. ఇందిరమ్మ పేరు చెబితే ఎమర్జెన్సీ గుర్తుకు వస్తుందనే ఇంగిత జ్ఞానం లేకుండా ఇందిరమ్మ పేరు పెడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. మేయర్ దృష్టి పెట్టాల్సింది కుక్కల బెడద, సమస్యలపైన కానీ పేర్ల మార్పు మీద కాదు అంటూ హితవుపలికారు. పథకాల పేర్లు మార్చడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు తప్పితే ఇళ్ళు లేని వాళ్లకు ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలకు సవాల్ విసురుతున్న.. ఇళ్లులేని వాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని నిరూపించాలన్నారు. రేవంత్ రెడ్డి నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామానికైనా వెళ్లి పరిశీలించాలన్నారు. 'కవిత ఎవ్వరూ.. కవిత బీసీనా. అధికారంలో ఉన్న పదేళ్లు ఎందుకు బీసీలు గుర్తుకురాలేదు. బీసీలకు అధ్యక్ష పదవి, ఎల్పీనేత పదవులు ఇవ్వకుండా బీసీ ఉద్యమం చేస్తామంటే ఎట్లా? మతపరమైన రిజర్వేషన్లు తొలగిస్తే.. రాజ్యాంగ సవరణ చేస్తాం' అని ఎంపీ రఘునందన్ రావు వెల్లడిరచారు.

# రైతుల కోసం న్యాయపోరాటం

(మొదటి పేజీ తరువాయి)



మూడేళ్ళకే కూలిపోయిందని ధ్వజమెత్తారు. అదే తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మిస్తే 62000 కోట్ల రూపాయలు మిగిలేవి అని.. వాటితో ఎస్ ఎల్ బి సి, డిరడి, పాలమూరు రంగారెడ్డి, భీమా, నెత్తంపాడు, కోయిల సాగర్, దేవాదుల, సీత రామ సాగర్, గౌరెల్లి, లాంటి ప్రాజెక్టు లు పూర్తి అయి.. నేడు తెలంగాణ సస్యాశ్యామలం అయ్యేదన్ని స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖపై వారు చేసిన తప్పిదాల వల్ల నేడు మేము 16000 కోట్ల రూపాయలు వడ్డీ చెలిస్తున్నామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి 27,500 కోట్లు, సీతారామ ప్రాజెక్ట్ 10,000 కోట్లు ఖర్చు చేసిన ఒక ఎకరం కొత్త ఆయకట్టు లోకి తీసుకొని రాలేదని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ముఖ్యమంత్రి, తాను నీటిపారుదల శాఖ లో జరిగిన తప్పిదాలను ఒక్కొకటి సరి చేసుకుంటూ.. కాళేశ్వరం నీరు ఇవ్వకున్నా.. తెలంగాణ లో ఖరీఫ్, రబీ సీజన్ లలో కలిపి 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పడిరచి దేశం లోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని చెప్పారు. అలాగే ముందస్తుగా రైతు లకి పెట్టుబడి కోసం 9 రోజులలో 9000 కోట్లు రైతు భరోసా కింద వేయటం జరిగిందని తెలిపారు. జవహర్ జానపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు యుద్ధ ప్రాతిపదికన వేగవంతంగా, నాణ్యత పాటిస్తూ పూర్తి చేయాలని మంత్రి కాంట్రాక్టర్ ని ఆదేశించారు. పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయని ఇప్పటికే మూడు సార్లు సందర్శించిన పనులలో పురోగతి లేదని కాంట్రాక్టర్ పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు జానపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ను 302 కోట్ల రూపాయలతో నిర్మించటం జరుగుతుందని దీని ద్వారా అలింగాపురం, రాఘవపురం, బొత్తలపాలెం, కోమటికుంట, మీగడం పాడు తండా, చెరువు తండా, హనుమాయగూడెం, పాలకీడు, సజ్జాపురం, నాగిరెడ్డి గూడెం గ్రామాలలోని 10,000 ఎకరాలకి సాగునీరు అలాగే జానపాడు చెరువు కి నీరు అందించటం జరుగుతుందని తెలిపారు.

# బనకచర్లపై రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణకు ఆమోదయోగ్యం లేకుంటే ఒప్పుకునేది లేదని 2016 మీటింగ్‌లో ఆయన చెప్పారని గుర్తుచేశారు. బనకచర్లపై కేంద్ర జలశక్తి మీటింగ్‌లో ప్రభుత్వం తెలంగాణ వాదనను గట్టిగా వినిపించాలని డిమాండ్ చేశారు. విషయం లేకనే.. సీఎం రేవంత్ రెడ్డి బూతులు ఎత్తుకున్నారని వ్యాఖ్యలు చేశారు. బేసిన్‌కు బాసిన్‌కు తేడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ఎంపీల మీటింగ్ ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బనకచర్ల కార్పొరేషన్ ఏర్పడలేదని, టెండర్లు పిలివలేదని చెప్పుకొచ్చారు.చేతులు కాలినాక.. ఆకులు పట్టుకున్న చందంగా బీజేపీ తీరుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు నష్టం జరగకముందే బనకచర్లను ఆపేలా.. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బనకచర్లపై రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మాజీ మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు.

# మావోయిస్టుల లేఖపై స్పందించిన సీతక్క

ములుగు, (తెలంగాణ ముచ్చట్లు)



ఆదివాసీల వ్యవహారంలో మావోయిస్టులు తనకు సంధించిన లేఖపై తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క స్పందించారు. తన మూలాలను తానెప్పుడు మరిచి పోలేదన్నారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగులో మంత్రి సీతక్క విలేకర్లతో మాట్లాడుతూ.. జీవో 49ను తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు. మంత్రిగా ఉండి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టానని వివరించారు. ఆ క్రమంలో ఆదివాసీల జోలికి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖతోపాటు తానూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఒకరిద్దరు అటవీశాఖ అధికారులు తప్పా.. ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. అయితే ఎవరు మాట్లాడినా నిజాలు మాట్లాడాలంటూ మావోయిస్టులకు ఆమె పరోక్షంగా సూచించారు ఆదివాసీల వ్యవహారంపై ఇవాళ (శుక్రవారం) ఉదయం మంత్రి సీతక్కకు మావోయిస్టులు లేఖ రాశారు. ఈ లేఖలో వారు ఏమన్నారంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా పని చేస్తున్న మాజీ మావోయిస్టు సీతక్క.. ఆదివాసీల హక్కుల గురించి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కులకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్కదేనని స్పష్టం చేశారు. జీవో నెంబర్ 49తో కుమురం భీమ్ జిల్లాలోని 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ఈ జీవో 49 కారణంగా రాష్ట్రంలో మూడు జిల్లాలు కనుమరుగవుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే జీవో నెం. 49 తీసుకువచ్చారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఈ లేఖపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి వివరణ ఇచ్చారు.

# నియోజకవర్గానికో నర్సింగ్ కళాశాల ఏర్పాటు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతోందని, పరిపాలనలో జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో 50 పడకల మాతాశిశు ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించి... 150 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి, హుస్నాబాద్‌కరీంనగర్ నాలుగు వరుసల రహదారి పనులకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (రోడ్లు, భవనాలు), తుమ్మల నాగేశ్వరరావు (వ్యవసాయ), పొన్నం ప్రభాకర్ (రవాణా, బీసీ సంక్షేమం) లతో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిద్దిపేట కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. అనంతరం జడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన సభలో మంత్రి దామోదర్ మాట్లాడుతూ... ''రాష్ట్రంలో కొత్తగా 8 వైద్య కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశాం. అవసరమైన మేరకు మరిన్ని పెంచుతాం. హుస్నాబాద్‌కు 50 సీట్లతో వైద్య విద్య పీజీ కళాశాలను మంజూరు చేస్తున్నాం. నర్సింగ్ కోర్సు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు దేశ, విదేశాల్లో సేవలందించి తెలంగాణకు గుర్తింపు తేవాలి'' అని ఆకాంక్షించారు.



# భర్తలను భార్యలే హత్య చేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)



''ప్రేమ ఉంటే పెళ్లి చేసుకోండి, అంతేకానీ వివాహేతర సంబంధాల కోసం తల్లిదండ్రులను, భర్తలను చంపకండి'' అని ఆయన విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరం నంబర్ వన్ స్థానంలో నిలవాలంటే ఇలాంటి చెడు సంప్రదాయాలకు, దురాచారాలకు ముగింపు పలకాలని ఆయన స్పష్టం చేశారు. కుటుంబ వ్యవస్థ పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వీహెచ్ గుర్తుచేశారు. భార్యాభర్తలు అన్యోన్యంగా జీవించాలని, పిల్లలు తమ తల్లిదండ్రులను ప్రేమగా చూసుకున్నప్పుడే కుటుంబం బాగుంటుందని హితవు పలికారు.







# రహదారుల భద్రతపై అధికారులు తనిఖీలు నిర్వహించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో రోడ్డు భద్రత పై సమీక్షా సమావేశం

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

రహదారుల భద్రతా చర్యల్లో భాగంగా ప్రతి 15 రోజులకు ఒకసారి ఆర్ అండ్ బి, పోలీస్, జాతీయ రహదారులు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో రోడ్డు భద్రతపై రోడ్లు, భవనాలు, పోలీస్, జాతీయ రహదారులు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు
ఈ సందర్భంగా సంబంధిత శాఖలు రోడ్డు భద్రతకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో రద్దీ ప్రాంతాలు, ప్రమాదకర ప్రాంతాలు, క్రిటికల్ జంక్షన్స్ లను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కటాక్షపూర్ వద్ద నిర్మాణంలో జాతీయ రహదారి పై ప్రమాదాల నివారణకు రేడియం తో కూడిన సైన్ బోర్డులు, బ్లింకర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ఆ జాబితాను అందజేయాలన్నారు. ప్రమాదాల నివారణకు మూతలు లేని, నిర్మాణ పనులు జరుగుతున్న చోట్ల, మ్యాన్ హోల్స్ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పలువురు అధికారులు సూచించిన అంశాలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు .ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, నేషనల్ హైవేస్ ఈఈ మనోహర్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## హతిరామ్ బావాజీ జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

- లంబాడ లైవ్ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు లావుడియా పల్లవి రాజు నాయక్

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**



18 కోట్ల బంజారా సమాజ ఆరాధ్య దైవమైన హతిరామ్ బావాజీ 596వ జయంతి వేడుకలను ఈనెల 29, 30 తేదీల్లో తిరుపతి, తిరుమలలో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ వేడుకల్లో ప్రతి బంజారా సంఘ సభ్యుడు పాల్గొని విజయవంతం చేయాలని లంబాడ లైవ్ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు లావుడియా పల్లవి రాజు నాయక్ పిలుపునిచ్చారు.
బంజారా ఫౌండేషన్ అధ్యక్షుడు శ్యామల రాథోడ్ మాట్లాడుతూ, 29వ తేదీన తిరుపతిలోని గాంధీ రోడ్డులో ఉన్న హతిరామ్ మట్టంలో ప్రత్యేక భోగ్ బండరో, పల్లకీ సేవ, ఉంజల సేవ, ఊరేగింపు కార్యక్రమాలు జరుగనున్నట్లు తెలిపారు. 30వ తేదీన తిరుమలలో హతిరామ్ బావాజీ సమాధి వద్ద ప్రత్యేక పూజలు, ఆయన జీవిత చరిత్రను ఆధారంగా చేసుకుని భజన మండలాలతో భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.
జయంతి వేడుకల్లో వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు, బంజారా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా హతిరామ్ మహారాజ్ దేవాలయాన్ని ప్రత్యేక బోర్డుగా ఏర్పాటు చేసి, బంజారాల వారిని చైర్మన్‌గా నియమించాలని కోరారు. దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.
జయంతి ఉత్సవాల్లో ప్రతి రాష్ట్రం నుంచి, జిల్లా నుంచి, గ్రామ స్థాయిలో అన్ని కుల సంఘాల ప్రతినిధులు, నాయకులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఎన్పీడీసీఎల్ నూతన డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపిన ఎస్టీ అసోసియేషన్ నాయకులు

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు వి. తిరుపతిరెడ్డి (డైరెక్టర్ ఫైనాన్స్), టి. మధుసూదన్ (డైరెక్టర్ ఆపరేషన్), వి. మోహన్ రావు (డైరెక్టర్), సి. ప్రభాకర్ (డైరెక్టర్ హెచ్ఆర్డీ & ఐఆర్) లను ఎస్టీ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యవర్గం సభ్యులు శుక్రవారం హనుమకొండలోని విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారికి శాలువా, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి. నందా రాథోడ్, కంపెనీ గౌరవ అధ్యక్షులు భూక్యా వాలు నాయక్, కంపెనీ అధ్యక్ష హర్జీ జాటోత్, కంపెనీ సెక్రటరీ శ్రీరామ్ నాయక్, కంపెనీ ఉపాధ్యక్షులు కే. రాజు చౌహాన్, వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బానోతు రాజశేఖర్, కే. బి. రాజేందర్, హన్మకొండ అధ్యక్ష కార్యదర్శులు జి. స్వామి నాయక్, డి. లక్ష్మణ్ నాయక్, అసోసియేషన్ నాయకులు రాజన్న (డిఈ), డి. తారాచంద్, జవహర్లాల్, బి. రవి, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

**పాలకుర్తి , తెలంగాణ ముచ్చట్లు :**

పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల క్రింద లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఒక విశిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షైక్, పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకం కింద
33 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 33,03,828/ విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ పథకం ద్వార పేద కుటుంబాల బాలికల వివాహానికి ఆర్థిక సాయం అందించడం ద్వారా వారి భవిష్యత్‌కి భరోసా కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యం.
ముఖ్యమంత్రి సహాయనిధి కింద వైద్య చికిత్స, అత్యవసర అవసరాల నిమిత్తం 49 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.17,50,000/ విలువైన చెక్కులను అందజేశారు. ఈ పథకం క్రింద తీవ్రమైన అనారోగ్య సమస్యలు, ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం తరపున నేరుగా ఆర్థిక సాయం అందించబడుతుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి, ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా పని చేస్తున్నాం. ఈ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేలా ఉండాలని నా ఆకాంక్ష. అలాగే, ప్రభుత్వ సహాయం కేవలం ఓ చెక్కు రూపంలో కాకుండా ఆ కుటుంబాల భవిష్యత్తును సురక్షితంగా మలిచే మార్గంగా మారాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షైక్ మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడికి పథకాలు పారదర్శకంగా అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉంది. పేదవారి బాధలపై ప్రభుత్వానికి మక్కువ ఉంది. ప్రతి ఒక్కరికి లబ్ధి చేరేలా నిష్కల్మషంగా సేవలు అందించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఆనందంతో ప్రభుత్వం, ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం చుట్టూ మంచి ఉత్సాహ వాతావరణం నెలకొంది. లబ్ధిదారులు ఎమ్మెల్యేకి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**

విద్యార్థినులకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అభ్యర్థనల గడువును ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్ వెస్ట్ ప్రిన్సిపాల్ గోలి శ్రీలత తెలిపారు.
కళాశాలలో బీకాం (సీఏ, జనరల్), బీఎస్సీ (బీజెడ్‌సీ, ఎంఎజెడ్‌సీ, ఎంపీసీసీ, ఎంసీసీ, ఎంఎస్టీసీ), బీఏ కోర్సులలో ప్రవేశాలకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈ నెల 28వ తేదీ వరకు దోస్తు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## తమ్మడపెల్లికి చెందిన హాఫీజ్‌కు వైద్యం కోసం ఎల్వోసీ మంజూరు

**జఫర్ ఘఢ్,తెలంగాణ ముచ్చట్లు:**

తమ్మడపెల్లి (ఐ) గ్రామానికి చెందిన మహమ్మద్ హాఫీజ్ (తండ్రి యాకుబ్) అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం స్థానిక మాజీ సర్పంచ్ అనిత సుధాకర్ బాబు ద్వారా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే, ఆయన స్పందించి హాఫీజ్‌కు రూ.2,50,000 విలువైన ఎల్వోసీని మంజూరు చేశారు.
ఆర్థిక సాయంతో తక్షణమే చికిత్స ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టిన ఎమ్మెల్యేకు హాఫీజ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## బీసీ డిగ్రీ గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

**చేవెళ్ల, తెలంగాణ ముచ్చట్లు:**



మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పురుషుల మరియు మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 30వ తేదీ వరకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. గీతాంజలి తెలిపారు.
బీఏ (అనిమేషన్ & విజువల్ ఎఫెక్ట్స్) గ్రూపులో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో చేవెళ్ల మోడల్ కాలనీ ప్రాంతంలోని ఎంజేపీ డిగ్రీ కళాశాలకు 30వ తేదీ లోపు హాజరుకావాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వివరాలకు 9676200683, 6300824461 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు కావాల్సిన చర్యలు సత్వరంగా అధికారులు తీసుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పరకాల మహిళా డెయిరీ ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, పలు శాఖల జిల్లా అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా మహిళా డెయిరీ భవన నిర్మాణం, పాల సేకరణ, డెయిరీ ద్వారా పాలు సరఫరా, మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలు గురించి ఎమ్మెల్యే, కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మహిళా డెయిరీ ఏర్పాటుకు సంబంధించిన వివిధ అంశాలపై ఆయా శాఖల అధికారులు సమన్వయంతో త్వరగా చర్యలు చేపట్టాలన్నారు. మిల్క్ సెంటర్ల ఏర్పాటు, రవాణా, సొసైటీ ఏర్పాటు, మార్కెటింగ్, చెల్లింపులు, తదితర అంశాలపై ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఆర్డీవోలు మేన శ్రీను, కౌసల్య దేవి, సహకార అధికారులు సంజీవ రెడ్డి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.





## సీనియర్ జర్నలిస్ట్ ఆడెపు మహేందర్ మృతి పట్ల ఎంపీ కడియం కావ్య సంతాపం

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**



సీనియర్ జర్నలిస్ట్ ఆడెపు మహేందర్ మృతి పట్ల వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సంతాపం వ్యక్తం చేశారు. హఠాన్మరణం వార్త వినగానే దిగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు.గత 15 సంవత్సరాలుగా హన్స్ ఇండియా పత్రిక ఉమ్మడి వరంగల్ బ్యూరో చీఫ్‌గా విధులు నిర్వహించిన ఆడెపు మహేందర్ అనేక పరిశోధనాత్మక కథనాలను ప్రజల ముందుకు తెచ్చారని కొనియాడారు. మీడియా రంగంలో ఆయన సేవలు మరువలేనివని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మంత్రికి వినతి పత్రం



**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

హైదరాబాద్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపెల్లి చంద్ర నేతృత్వంలో రాష్ట్ర, జిల్లా నాయకులు శుక్రవారం కార్మిక శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లేబర్ అసిస్టెంట్ కమిషనర్ గంగాధర్‌తో కూడా చర్చలు జరిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిద్దిపేటలో పెద్ద ఎత్తున సభ నిర్వహించేందుకు మంత్రితో త్వరలో సమయం కోరనున్నట్లు దరిపెల్లి చంద్ర తెలిపారు.

సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెలిమెల రాములు, ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, ప్రచార కార్యదర్శి నల్ల స్వామి, కార్యదర్శులు రాసమల్ల కొమురయ్య, తోట్ల పరిచరాములు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దుబల శ్రీశైలం, జనగామ జిల్లా అధ్యక్షుడు తుది అంజయ్య, జిల్లా నాయకులు నారబోయిన రాజు, బాబు, జోజీ, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.



# నర్సింహారెడ్డి పార్థీవ దేహానికి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:**

స్టేషన్ ఘనపూర్ మండలం కొత్తపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ రెడ్డి తండ్రి గంగుల నర్సింహారెడ్డి మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య వారి స్వగృహానికి వెళ్లి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన సేవలను, కుటుంబ పోషణలో ఆయన చేసిన కృషిని గుర్తు చేస్తూ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మృతురాలు కుటుంబానికి ఆర్థిక సాయం

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండల పరిధిలోని అమ్మపల్లి గ్రామంలో వడ్డే పెంటమ్మ (60) అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. శుక్రవారం మృతురాలి కుటుంబానికి వనపర్తి ఎమ్మెల్యే మెఘా రెడ్డి అభయ హస్తం ద్వారా 5000/ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి 5000/ వడ్డెర సంఘం నుండి 12000/ ఆర్థిక సహాయం గ్రామ నాయకులు అందజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో మృతురాలు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ గౌని వెంకటేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పిడుగు ,బందెన్న, వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ అరెస్టులతో జిపి కార్మికుల ఉద్యమాన్ని ఆపలేరు

- **మండల సీపీఎం కార్యదర్శి సాదం రమేష్**

**చిల్పూర్,తెలంగాణ ముచ్చట్లు:**



చిల్పూర్ మండలంలోని పంచాయతీ కార్మికులు, కారోబార్ల సమస్యల పరిష్కారానికి సంబంధించి హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించాల్సిన ముట్టడి కార్యక్రమానికి ముందుగా కార్మికులను అరెస్ట్ చేసిన తీరును సీపీఎం మండల శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా మండల సీపీఎం కార్యదర్శి సాదం రమేష్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్ని ఆటంకాలు కల్పించినా పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా జరిగి తీరుతుందని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, చేతనైతే కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# జూలై 12 లోపు నైపుణ్య శిక్షణ కోసం ఎంబీసి నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి.....

- **జిల్లా బీసి అభివృద్ధి అధికారిణి జ్యోతి**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు;**

జూలై 12 లోపు నైపుణ్య శిక్షణ కోసం ఆసక్తి , అర్హత గల ఎంబీసి నిరుద్యోగ యువతి, యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమం (4) రోజుల పాటు హైదరాబాద్ లో అందించడం జరుగు తుందని, శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజన సదుపాయం, ట్రావెలింగ్ అలవెన్సు, వసతి కల్పించడం జరుగుతుందని అన్నారు.

అభ్యర్థులకు 21 నుంచి 30 సంవత్సరాల వరకు వయస్సు ఉండాలని, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలని, ఎంబిసి 36 కులాల వారికి మాత్రమే ఈ శిక్షణా కార్యక్రమం ఇవ్వనున్నట్లు, వీరి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల వరకు ఉండాలని అన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను జూలై 12 లోపు tgobmms.cgg.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు ఫారానికి

ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లను జత చేసి ఖమ్మం కలెక్టరేట్ లో ఉన్న బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జూలై 14 లోపు సమర్పించాలని, నిరుద్యోగ ఎంబీసీ యువతీ, యువకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసి అభివృద్ధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య విద్య కళాశాలల్లో వసతులు, సౌకర్యాల కల్పనకు ప్రభుత్వానికి నివేదిక

- **రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ**

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు :**







ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు వైద్య విద్య కళాశాలలకు ఎన్ఎంసి నిబంధనల మేరకు సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, తెలంగాణ ప్రభుత్వం నియమించిన కేఎంసి,నర్సంపేట, జనగామ వైద్య కళాశాలల పర్యవేక్షణ కమిటీ ఛైర్ పర్సన్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. శుక్రవారం వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద లతో కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ మోహన్ దాస్, వివిధ విభాగాధిపతులు, హనుమకొండ వరంగల్ జిల్లాల్లోని అనుబంధ ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో ప్రభుత్వ ఆసుపత్రులలో వసతుల కల్పనకు కావలసిన వివిధ అంశాలపై కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ముందుగా కాకతీయ మెడికల్ కళాశాలలో బోధన, బోధనేతర, ల్యాబ్, సిబ్బంది, కావాల్సిన వసతులపై సమీక్షించారు. కేఎంసిలోని హేమటాలజి విభాగాన్ని, వైద్య విద్యార్థినుల వసతి గృహాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి వాటిని గురించిన వివరాలను ప్రిన్సిపల్ రామ్ కుమార్ రెడ్డిని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేఎంసి లో ఉన్న ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన (పిఎంఎస్ఎస్ వై ) ఆసుపత్రిలోని పలు విభాగాలను జిల్లాల కలెక్టర్లు, వైద్యాధికారులతో కలిసి కమిషనర్ సందర్శించి అక్కడున్న వనరులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని సందర్శించి ఓపి విభాగం, ఆరోగ్యశ్రీ, లేబర్ రూమ్, నియోనాటల్ వార్డ్ ల ను కమిషనర్ సందర్శించి ఆయా వార్డుల వివరాలు, ఓపి సేవలు, రిఫరల్స్, ఫాలో అప్, ప్రసూతి సేవలను గురించి, వైద్యులు సిబ్బంది, తదితర వివరాలను వైద్యాధికారులను కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ ఛాతి, క్షయ వ్యాధుల ఆస్పత్రిని కమిషనర్ సందర్శించి అక్కడికి వస్తున్న పేషంట్స్, అందిస్తున్న ఓపి సేవలను గురించి ఏ విధంగా మెడికల్ వ్యర్థాలను ఎక్కడికి తరలిస్తున్నారు, ఎలా తరలిస్తున్నారనే వివరాలను సంబంధిత వైద్యాధికారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వరంగల్ ఎంజీఎంతో పాటు సికేఎం ఆస్పత్రులను సందర్శించి వాటి వివరాలను, సమకూర్చాల్సిన సౌకర్యాలను గురించి వైద్యాధికారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు.

ఈ సమీక్ష సమావేశంలో వివిధ విభాగాల్లో వనరుల కొరత, యూజీ మెడికల్ ఎడ్యుకేషన్ ఎన్ఎంసి నిబంధన ప్రకారం ఉండాల్సిన, సమకూర్చాల్సిన సౌకర్యాల గురించి కూలంకషంగా చర్చించారు. కాకతీయ మెడికల్ కళాశాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు, సౌకర్యాల గురించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు. వరంగల్ ఎంజీఎం, సికేఎం ఆస్పత్రుల్లోని ఓపి విభాగాలను సందర్శించి ప్రతిరోజు ఎంతమంది ఓపి సేవలకు వస్తుంటారని, ఓపి నమోదు కోసం ఎన్ని కౌంటర్లను ఏర్పాటు చేశారని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఎంజీఎం ఆసుపత్రిలోని ఈ ఔషధీ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. అదేవిధంగా ఎంజీఎం ఆసుపత్రిలో ఓపి సేవల విభాగంలో అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంజీఎం, సీకేఎం ఆస్పత్రుల్లోని నియోనాటల్ వార్డులను సందర్శించి అక్కడున్న సౌకర్యాలను కమిషనర్ వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా హనుమకొండ వరంగల్ జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, టీజీఎంఐడిసి ఈఈ ప్రసాద్, కేఎంసి ఏడి రమేష్, ప్రసాద్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరి, సికేఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల, ప్రభుత్వ ఛాతి, క్షయ వ్యాధుల ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సునీత, ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.






# పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక కేటాయించాలి.....

- **అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక కేటాయించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరాపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సమస్య రాకుండా మండలాల వారీగా ఎక్కడి నుంచి ఇసుక తీసుకోవాలో ప్రభుత్వం నిర్ణయించి ఇసుక రీచ్ లను కేటాయించిందని అన్నారు.

మండలాల్లో ఎక్కడైనా ఇసుక తరలించే పాయింట్ అందుబాటులో ఉంటే ఆ వివరాలను తహసిల్దార్ అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు హౌజింగ్ శాఖ ఏఇ నుంచి ఏ సమయంలో ఎన్ని ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉంటుందో వివరాలతో లేఖ అందించాలని అన్నారు. ఏఇ అందించిన లేఖ ఆధారంగా తహసిల్దార్ కూపన్ జారీ చేస్తారని, కూపన్ తో 3 రోజులలో సంబంధిత మండలానికి కేటాయించిన ఇసుక రీచ్ నుంచి ఇసుక తెచ్చుకోవాల్సి ఉంటుందని, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో అవసరమైన వాహనాలు అందుబాటులో ఉంటాయని, స్వశక్తి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇసుక రీచ్ లు నిర్వహిస్తున్నామని, ప్రతి ట్రాక్టర్ లోడ్ ఇసుకకు 200 రూపాయలు తహసిల్దార్ కార్యాలయం వద్ద చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. 200 రూపాయలలో సగం వంద రూపాయలు మహిళా సంఘాలకు, 50 రూపాయలు స్థానిక గ్రామ పంచాయతీలకు, 50 రూపాయలు గ్రామీణ అభివృద్ధి శాఖకు వెళ్తాయని అన్నారు. ఉదయం 6.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు మాత్రమే ఇసుక రీచ్ ల నుండి ఇసుక తరలించాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక కేటాయింపుపై అధికారులకు ఉన్న పలు సందేహాలను అదనపు కలెక్టర్ నివృత్తి చేశారు.

**విపత్తు నిర్వహణకు అవసరమైన సామాగ్రి ఏర్పాటుకు చర్యలు:**

విపత్తు నిర్వహణ కోసం అవసరమైన పరికరాలు అందుబాటులో పెట్టెందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ అన్నారు. టార్చ్ లైట్, లైఫ్ జాకెట్, స్పీకర్ మైక్ సెట్స్, బోట్లు, జిప్ కవర్, గజ ఈతగాళ్ళకు ఎంత వరకు అందుబాటులో ఉన్నాయో పరిశీలించాలని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి మండల స్థాయిలో విపత్తు నిర్వహణ కమిటీ సమావేశాలు నిర్వహించాలని అన్నారు. ఆపద మిత్ర, గజ ఈతగాళ్ళతో రెగ్యులర్ గా టచ్ లో ఉండాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 24 సభ్యులతో కూడిన ఎన్.డి.ఆర్.ఎఫ్, 24 సభ్యులతో కూడిన ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను స్టేషన్ చేసి పెట్టామని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా మైనింగ్ అధికారి సాయినాథ్, ఆర్డీవోలు నరసింహా రావు, ఎల్. రాజేందర్,డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, ఎంపీఓ లు, హౌజింగ్ ఏఇ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

- భవనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి
- బాలల రక్షణ సంరక్షణ కోసం కృషి చేయాలి
- సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి
- అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:

జిల్లాలోని ప్రభుత్వ మరియు పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను
(చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్)
శుక్రవారం అదనపు కలెక్టర్ ఏ వెంకట్ రెడ్డి తనిఖీ చేశారు.
అదనపు కలెక్టర్ తో జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులతో కలిసి ఫాతిమానగర్ లోని డివైన్ మెర్సీ, హన్మకొండలోని ప్రభుత్వ బాలసదనం, స్పందన మానసిక దివ్యాంగుల కేంద్రాలను పరిశీలించారు, నిబంధనల మేరకు కనీస ప్రమాణాలు పాటించాలని, ముఖ్యంగా భవనాలకు సంబంధించిన సౌండ్నెస్, ఫిట్నెస్ సర్టిఫికెట్ లను సంబంధిత ఆధికారులనుండి తీసుకోవాలని, అలా పాటించని సంస్థలకు నోటీస్ లు ఇచ్చి తగిన గడువులోగా పూర్తిచేయుటకు సంబంధిత కమిటీ, అధికారులు చర్యలు తీసుకొని, నివేదికలు సమర్పించాలని అన్నారు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, శానిటేషన్ సర్టిఫికెట్, వాటర్ ప్యూరిఫికేశన్ సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు, ఈ సందర్భంగా డార్మెటరీ, వాష్ రూమ్స్, డైనింగ్ హాల్, పరిసరాలను పరిశీలించారు, రికార్డులను, పిల్లలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.
లైసెన్స్ కలిగి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకొనే సంస్థలు తప్పకుండా కనీస ప్రమాణాలు పాటించాలని లేనిచో నిబంధనల మేరకు చర్యలుంటాయని అన్నారు.
కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ అన్నమనేని అనిల్ చందర్ రావు, సభ్యుడు సందసాని రాజేంద్ర ప్రసాద్, ఇన్చార్జి డిసిపిఓ ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక తదితరులు పాల్గొన్నారు









# ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

–పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్11 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులకు ఆదేశించారు. ఆపరేషన్ ముస్కాన్11 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వివిధ శాఖల సంబంధిత అధికారులతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలను గుర్తించి, వారిని రక్షించి, పునరావాసం కల్పించి, సమస్యను పరిష్కరించడం వంటి లక్ష్యంతో కలిగిని ఈ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పరిశ్రమలు, వ్యాపార సముదాయాల్లో ఈ ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహించాలని, పిల్లలను పనిలో పెట్టుకునే యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు పట్టుబడిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించాలని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ అందించి, అనాథలుగా ఉంటే వారిని కేర్హోమ్కు తరలించే ప్రక్రియను దృష్టి పెట్టాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే 100 లేదా 1098కు డయల్ చేయాలని, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ కోరారు. ఆపరేషన్ ముస్కాన్ ప్రతి ఏటా జూలై 1 నుంచి 31వ తేదీ వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించడం జరుగుతుందన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేశారని తెలిపారు. పిల్లలతో పనిచేసే అవకాశాలు ఉన్న పలు పరిశ్రమలు, హోటల్స్, వ్యాపార సముదాయాలు, గోదాములు, గోదాములు, మెకానిక్ షాపులు తదితర ప్రాంతాల్లో వ్యూహాత్మక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్10లో భాగంగా గతేడాది 79 మందికి వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ ఏడాది అపరేషన్ స్మైల్ 11 కార్యక్రమం ద్వారా 53 వెట్టి చాకిరీ నుండి రక్షించి 44 మంది బాలలను తల్లిదండ్రులు అప్పగించినట్లు తెలిపారు. మరో 9 మందిని రెస్క్యూ హోమ్ తరలించినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ ప్రసాద్ రావు, సత్యనారాయణ (డిఇఓ), విజయ భస్కర్ రెడ్డి, (డిప్యూటీ కమిషనర్ ,కార్మిక శాఖ) టి. విష్ణు వందన (డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్) డాక్టర్ చందన (నోడల్ ఆఫీసర్ హెల్త్ డిపార్ట్మెంట్)అనిత (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు) ఇన్స్పెక్టర్ స్వామి పాల్గొన్నారు.

# శోక గ్రంధం

ఒక్కసారి వచ్చిపోవ
వేలల్లో ఒక్కదేవ

బహుమతాల సంతలో
పెద్ద రచ్చవైపోయావా

సందుకొక సైన్యముంది
నిన్నే కాపాడే శౌర్యముంది

ధైర్యంగా వచ్చిపోవ
నీ నిజరూపము చెప్పలేవా

సనాతనమని చంపుతాము
కాఫిర్లని పేల్చుతాము
పరిశుద్ధతని బెట్టుగుండి
మా పక్కనోన్ని తక్కువంటం

మా నరజాతిని అణగద్రొక్కి
నిను నిలువెత్తున నిలుపుకుంటాం

గుడిసెలేని సంచారిని
వడి వడిగా తరుముతుంటాం

నీకు వీధికొక జాగా ఇచ్చి
మా దానదారిద్ర్యం తెలుపుకుంటాం

వేల ఏళ్ల రక్తపాతం
చలించని నీ మౌనజ్ఞానం

నీ పేరు మీద మరణశాతం
చావులెక్కలన్నీ తేల్చుకుందాం

శోక గ్రంథాలను రాసుకుందాం
ఒక్కసారి వచ్చి పోవ
ఈ మత యుద్ధాలను ఆపలేవ?



నేపా. సంతోష్ అచ్యుత్ కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత.8639442397.



# మార్చేవాళ్లెవరు?

సామాన్యులు
కష్ట జీవులు
కూలినాలి జనం
పుత్తుపూసలేనివాళ్లు
ఏది చెపితే
అదినమ్మేవాళ్ళు
మూఢవిశ్వాసాలతో
నిండినవాళ్లు
ఓటువిలువ
తెలియనివాళ్లు
వెయ్యి రూకలకు
అమ్ముకునేవాళ్ళు
తమకష్టాన్ని
ముడుపులు కట్టి
హుండీల్లో వేసేవాళ్ళు
ప్రతి యేడుకొండకెళ్లి
గుండుకొట్టించే వాళ్ళు
బాబాల చేతివాటం
మహిమలనినమ్మేవాళ్ళు
బ్రమ్మోత్సవాలు
రథ యాత్రలు
పుష్కరాలు
కుంభమేళాలు
మతం ఆడే ఆటని
తెలియనివాళ్ళు
వీళ్లంతా తరతరాల
వంచితులు పీడితులు!
వీళ్ళను మార్చాలి!
వీళ్ళ అజ్ఞానం మీద
బ్రతికేవాళ్లంతా
వంచకులుపీడకులు
దీనిపేరే వర్గసమాజం!
దోపిడీ సమాజం!
మార్చేవాళ్లెవరు?

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# బాల్య మిత్రుడు నాగరాజును పరామర్శించిన పదవ తరగతి మిత్రులు

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:

వారంతా 2005 2006 లో పదవ తరగతి కలిసి చదువుకున్నారు. పెద్దమందడి మండలంలో జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో చదువుకున్న తోటి స్నేహితుడు అనారోగ్యంతో సమస్యల తో బాధపడుతూ మృత్యు తో పోరాడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు
చిన్నమందడి గ్రామం లో శుక్రవారం నాగరాజు ను పరామర్శించారు. మిత్రుడునీ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ మృత్యుతో పోరాడుతూ ప్రాణాపాయం స్థితిలో కొట్టుమీట్టాడుతున్న ఉన్న నాగరాజును పరామర్శించిన బాల్య మిత్రులు. పి.గోపాల కృష్ణయాదవ్,ఖాదర్, కురుమూర్తియాదవ్, మధు ,నరేష్ అంబరీష్ ,మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ, కొమ్ము చెన్నకేశవులు, రాజు స్నేహితులందరూ కలిసిఇంటి దగ్గర పరామర్శించడం జరిగింది.కుటుంబ పరిస్థితి నిరుపేద కుటుంబం ఇల్లు గుడిసెలో ఉండి జీవనోపాధి కొనసాగిస్తున్నారు కుటుంబం పరిస్థితి పేదరికంలో ఉంది నాగరాజు కు ఇద్దరు కుమారులకు వినికిడి , మూగ లోపం మాటలు రాని పిల్లలు, భార్య ఉన్నారు.తల్లిదండ్రులును కలిసి పూర్తిస్థాయిలో ఆ కుటుంబానికి మనోధర్యం ఆత్మవిశ్వాసం కల్పించడం జరిగింది.కావున పెద్దమందడి టెన్త్ క్లాస్ మిత్రులందరికీ స్పందించి తక్షణమే ఆర్థికపరమైన సహకారం అందించాలని ఆశిస్తున్నాను మేము స్నేహితులందరూ ప్రస్తుతం తక్షణ సాయం కింద 10000/ (పదివేల రూపాయలు) భార్యకు అందించడం జరిగింది. అందరూ స్పందించి ఆర్థిక సహకారాలు అందించి నాగరాజును చివరిసారిగా అందరూ మధురమైన జ్ఞాపకాలతో గుర్తుచేసుకొని పరామర్శించాల్సిందిగా కోరుచున్నాను. ప్రభుత్వం ఆదుకోవాలి అని ఆ కుటుంబ సభ్యులు కోరారు.




# ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:

జనగాం జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలంలోని అక్కపెల్లిగూడెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఏర్పాటు కార్యక్రమం జరిగింది. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ కమిటీ ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు గుర్రం నవీన్ మాదిగ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జి మంద శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ, 30 సంవత్సరాలుగా ఏబీసీడీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన కృషిని కొనియాడారు. ఈ వర్గీకరణ ద్వారా మాదిగ ఉపకులాలకు గుర్తింపు, గౌరవం లభించాయని, సమాజంలో సమానత్వం కోసం ఆయన ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు.
ఎమ్మార్పీఎస్ చరిత్ర గొప్పదని, ప్రతి కార్యకర్త పాత్ర విశేషమని పేర్కొన్న శ్రీనివాస్, జులై 7న జరిగే 31వ ఆవిర్భవ దినోత్సవాన్ని గ్రామ స్థాయిలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా అక్కపెల్లిగూడెం గ్రామ నూతన ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ కమిటీని ప్రకటించారు. బొమ్మగల అనిల్ మాదిగ అధ్యక్షుడిగా, బొమ్మగల అఖిల్ మాదిగ ఉపాధ్యక్షుడిగా, బొమ్మగల సుధీర్ మాదిగ ప్రధాన కార్యదర్శిగా, బొమ్మగల సురేష్ మాదిగ కోశాధికారిగా, బొమ్మగల నవీన్ మాదిగ కార్యవర్గ సభ్యుడిగా, బొమ్మగల ప్రశాంత్ మాదిగ సలహాదారుగా నియమితులయ్యారు.
అలాగే, ఎంఎస్పి కమిటీని కూడా ప్రకటించారు. బొమ్మగల పేతురు మాదిగ గ్రామ అధ్యక్షుడిగా, బొమ్మగల ఏలియా మాదిగ ఉపాధ్యక్షుడిగా, బొమ్మగల కుమార్ మాదిగ ప్రధాన కార్యదర్శిగా, బైరపాక రాజన్న మాదిగ కోశాధికారిగా, బొమ్మగల సోమన్న మాదిగ సలహాదారుగా నియమితులయ్యారు.
ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 31వ ఆవిర్భవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



# ధర్మపురంలో జెండా గద్దె నిర్మాణానికి భూమి పూజ



ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:

ధర్మసాగర్ మండలంలోని ధర్మపురం గ్రామంలో జెండా గద్దె నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ కుల పెద్దలు, కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జెండా గద్దె నిర్మాణానికి సంబంధించిన ఏర్పాట్లపై మాదిగ సమాజ నాయకులతో చర్చించి, సమూహంగా భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గంగారపు శ్రీనివాస్ మాదిగ (ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ధర్మసాగర్ మండల ఇంచార్జి), మునిగాల యాకుబు (మాజీ సర్పంచ్), భరిగల రాజు, పుట్ట ప్రశాంత్ మాదిగ (జిల్లా నాయకులు), సోంపెల్లి అన్వేష్ (మండల అధ్యక్షుడు), ముట్టడ బాలస్వామి (మండల సీనియర్ నాయకుడు), భరీగల ప్రదీప్ కుమార్ (ప్రచార కార్యదర్శి),బరిగల నారి, భరీగల అరుణ్ కుమార్, బీ సంగీత్, బీ వినోద్, బీ చరణ్, బైరపాక జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జూన్ 30లోపు ముగియాల్సిన ఆర్థిక కార్యకలాపాలు




దేశంలో ప్రతి నెలలో కూడా అనేక రకాల ఆర్థిక కార్యకలాపాలు జరుగుతుంటాయి. ఈ క్రమంలోనే ఈసారి జూన్ 30, 2025లోపు ఎలాంటి ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. వాటిని సకాలంలో పూర్తి చేయకపోతే ఏం జరుగుతుందనే విషయాలు తెలుసుకుందాం. దేశంలో ప్రతి నెలలో మాదిరిగా ఈసారి కూడా కొన్ని ఆర్థిక అంశాలు ఉన్నాయి. ఈ నెల మరికొన్ని రోజుల్లో పూర్తి కానున్న నేపథ్యంలో వాటి గురించి తెలుసుకోవడం ద్వారా ఇబ్బందులు లేకుండా ఉండవచ్చు. అయితే పన్ను చెల్లింపులు, రిటర్న్ దాఖలు, రిజిస్ట్రేషన్‌లు, ఇతర అవసరాలతో సంబంధం కలిగి ఉన్నాయి. అయితే ఈసారి ఏం ఉన్నాయనే విషయాలుఇక్కడ చూద్దాం. గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ కింద నమోదు చేసుకున్న వ్యాపారాలు తమ నెలవారీ లేదా త్రైమాసిక రిటర్న్‌లను దాఖలు చేయాలి. జూన్ 2025కి సంబంధించిన జీఎస్టీ రిటర్న్‌లు, జీఎస్టీఆర్1, జీఎస్టీఆర్3బీ, ఇతర సంబంధిత ఫారమ్‌లు జూన్ 30, 2025 లోపు దాఖలు చేయాలి. ఈ గడువు పాటించడం వల్ల జరిమానాలు, వడ్డీ చెల్లింపులను నివారించవచ్చు. అలాగే జీఎస్టీ పోర్టల్ ద్వారా ఈ రిటర్న్‌లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయవచ్చు. వ్యాపారులు తమ లావాదేవీలను సమీక్షించి ఖచ్చితమైన సమాచారాన్ని సమర్పించాలి.

మే 2025 నెలకు సంబంధించిన ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్, ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్ చెల్లింపులు జూన్ 7, 2025 నాటికి పూర్తి చేయాలి. అయితే, ఈ చెల్లింపులకు సంబంధించిన రిటర్న్‌లు జూన్ 30, 2025 లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ రిటర్న్‌లు సరైన సమయంలో దాఖలు చేయడం వల్ల ఆలస్య రుసుమును తగ్గించుకోవచ్చు. టీడీఎస్ రిటర్న్‌లు ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు చాలా కీలకం. ఎందుకంటే ఇవి ఆయా వ్యక్తులు లేదా సంస్థల నుంచి తగ్గించిన పన్ను రికార్డులను నిర్వహిస్తాయి. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కింద నమోదు చేసుకున్న వారు మే 2025 నెలకు సంబంధించిన కంట్రిబ్యూషన్‌లను జూన్ 15, 2025 నాటికి చెల్లించాలి. అదనంగా, ఈఎస్ఐ రిటర్న్‌లు జూన్ 30, 2025లోపు దాఖలు చేయాలి. ఈ కంట్రిబ్యూషన్‌లు ఉద్యోగుల సామాజిక భద్రతకు చాలా కీలకం. గడువు దాటితే జరిమానాలు విధించబడతాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లింపులు, రిటర్న్ దాఖలు జూన్ 30, 2025 నాటికి పూర్తి చేయాలి. ఈ గడువు ఆయా రాష్ట్ర నిర్దిష్ట నిబంధనలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వ్యాపారులు, ప్రొఫెషనల్స్ స్థానిక చట్టాల గురించి తెలుసుకుని నిర్ణయించుకోవడం ఉత్తమం. కంపెనీల చట్టం 2013 ప్రకారం, ప్రైవేట్, పబ్లిక్ కంపెనీలు తమ వార్షిక రిటర్న్‌లు, ఆర్థిక స్టేట్‌మెంట్‌లను దాఖలు చేయాలి. ఆర్థిక సంవత్సరం ముగింపు (మార్చి 31, 2025) తర్వాత, ఈ దాఖలు సాధారణంగా జూన్ నెలలో గడువు ఉంటుంది. ప్రత్యేకించి ఆడిట్ పూర్తయిన కంపెనీలు ఈ గడువును పాటించడం వల్ల రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌తో సమస్యలను నివారించుకోవచ్చు.

# సత్తా చాటుతున్న దేశీయ కంపెనీల బ్రాండ్లు

- టాప్-100 బ్రాండ్స్ విలువ రూ.20.27 లక్షల కోట్లు
- అగ్రస్థానంలో టాటా బ్రాండ్ : బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక వెల్లడి





బ్రాండ్ వాల్యూ విషయంలో మన దేశీయ కంపెనీలూ సత్తా చాటుతున్నాయి. ప్రస్తుతం భారత్‌లోని టాప్100 కంపెనీల బ్రాండ్ వాల్యూ 23,650 కోట్ల డాలర్ల (సుమారు రూ.20.27 లక్షల కోట్లు) వరకు ఉంటుందని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా సంస్థ ఒక నివేదికలో తెలిపింది. ఇందులో టాటా గ్రూప్ బ్రాండ్ విలువే 3,160 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.78 లక్షల కోట్లు) మేర ఉందని తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం టాటా గ్రూప్ బ్రాండ్ విలువ 10 శాతం పెరిగింది. బ్రాండ్ వాల్యూ 3,000 కోట్ల డాలర్లకు మించిన తొలి భారత పారిశ్రామిక గ్రూప్ కూడా టాటా గ్రూపేనని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా తెలిపింది. బ్రాండ్ వాల్యూపరంగా టాటా గ్రూప్ తర్వాత ఇన్ఫోసిస్ (1,630 కోట్ల డాలర్లు), హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ (1,420 కోట్ల డాలర్లు), ఎల్ఐసీ (1,360 కోట్ల డాలర్లు), రిలయన్స్ గ్రూప్ (980 కోట్ల డాలర్లు), ఎస్‌బీఐ గ్రూప్ (960 కోట్ల డాలర్లు), హెచ్‌సీఎల్ టెక్ (890 కోట్ల డాలర్లు), ఎయిర్‌టెల్ (770 కోట్ల డాలర్లు), ఎల్ అండ్ టీ గ్రూప్ (740 కోట్ల డాలర్లు), మహీంద్రా గ్రూప్ (720 కోట్ల డాలర్లు) వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

దూకుడుగా అదానీ గ్రూప్ ఇక వేగంగా బ్రాండ్ వాల్యూ పెంచుకుంటున్న పారిశ్రామిక సంస్థల్లో అదానీ గ్రూప్ అగ్రస్థానంలో ఉంది. గత సంవత్సర కాలంలో ఈ గ్రూప్ బ్రాండ్ వాల్యూ 82 శాతం పెరిగింది. కంపెనీల పరంగా చూస్తే తాజ్ హోటల్స్, ఏషియన్ పెయింట్స్, అమూల్ ముందున్నాయి.

## పోకో ఎఫ్7 5జీ స్మార్ట్‌ఫోన్

స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ పోకో.. మార్కెట్లోకి సరికొత్త 5జీ స్మార్ట్‌ఫోన్ పోకో ఎఫ్7 విడుదల చేసింది. భారత్‌లోనే తొలిసారిగా 7,550 ఎంఏహెచ్ బ్యాటరీతో దీన్ని రూపొందించినట్లు సంస్థ ప్రొడక్ట్ మేనేజర్ సచిన్ దేవ్ వెల్లడిరచారు. సిలికాన్ కార్బన్‌తో కూడిన ఈ బ్యాటరీ దీర్ఘకాలం సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 చిప్‌సెట్, 6.83 అంగుళాల స్క్రీన్, 50 ఎంపీ సోనీ ఐమ్యాక్స్882 కెమెరాతో రెండు వేరియంట్లలో ఈ ఫోన్ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. 12 జీబీ రామ్, 256 జీబీ మెమరీతో కూడిన ఎఫ్ 7 ధర రూ.29,999గా ఉండగా 12 జీబీ రామ్ 512 జీబీ మెమరీతో కూడిన ఫోన్ ధర రూ.31,299గా ఉంది. జూలై 1న ఈకామర్స్ పోర్టల్ ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఈ ఫోన్‌ను విడుదల చేయనున్నట్లు సచిన్ తెలిపారు.



## గౌతమ్ ఆదానీ పుట్టిన రోజున భార్య ఏం చెప్పిందో తెలుసా?


అదానీ గ్రూప్ వ్యాపారం దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా విస్తరించి ఉంది. అలాగే ఈ గ్రూప్‌లోని 10 కంపెనీలు స్టాక్ మార్కెట్లో జాబితా చేయబడ్డాయి. వాటిలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ పోర్ట్స్, అదానీ పవర్, అదానీ.. అదానీ గ్రూప్ చైర్మన్ దేశంలో రెండవ అత్యంత ధనవంతుడు అయిన గౌతమ్ అదానీ మంగళవారంతో 63 ఏళ్లు నిండాయి. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆయన భార్య ప్రీతి అదానీ, కుమారులు కరణ్, జీత్ అదానీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన విషయం తెలిసిందే. ఆయన భార్య అదానీతో ఒక చిత్రాన్ని షేర్ చేసి, ఆయనతో కలిసి నడుస్తున్నందుకు గర్వంగా వ్యక్తం చేయగా, కుమారుడు జీత్ అదానీ కూడా చిన్ననాటి ఫోటోను షేర్ చేసి 'హ్యాపీ బర్త్‌డే పప్పా' అని అన్నారు.

# మరోసారి దాతృత్వం చాటుకున్న అదానీ..





పవిత్ర నగరం మహాప్రభు జగన్నాథ పూరి రథయాత్రకు సిద్ధమైంది. ప్రపంచం నలుమూలల నుండి ప్రతి సంవత్సరం వచ్చే లక్షలాది మంది భక్తులకు ఇది ఒక ప్రత్యేకమైన విశ్వాసం ప్రయాణం. ఈ ఏడాది పూరి జగన్నాథ రథయాత్రకు ఏర్పాట్లు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. అక్షయ తృతీయ రోజు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, రథం నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆషాడ మాసం రెండో రోజు (జూన్ 27) నుంచి రథయాత్ర ప్రారంభమవుతుంది. ఇది 12 రోజులపాటు జరుగుతుంది. జగన్నాథుడి దర్శనం కోసం వచ్చే యాత్రికులకు వారి ఆహ్లాదకరమైన అనుభవం కోసం భారతీయ రైల్వేలు కూడా సిద్ధంగా ఉన్నాయి. జగన్నాథ పూరి రథయాత్రకు తరలివచ్చే భక్తులకు సేవ చేసేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ మరోసారి ముందుకు వచ్చారు. మహా కుంభమేళా తర్వాత, అదానీ పూరి రథయాత్రలో సేవలు అందించాలని భావిస్తున్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సందర్భంగా ప్రజలకు ఆహారం అందించారు. ఎక్కువగా స్వచ్ఛంద సేవకుల చొరవ తర్వాత, అదానీ గ్రూప్ ఇప్పుడు భారతదేశంలోని అత్యంత గౌరవనీయమైన మతపరమైన పండుగలలో మరొకటి %% ఒడిశాలోని పూరిలో జరిగే రథయాత్రపై దృష్టి సారించింది. పూరిలోని జగన్నాథ ఆలయంలో ఏటా నిర్వహించే రథయాత్రకు దేశవిదేశాలకు చెందిన లక్షలాది మంది భక్తులు హాజరవుతారు. 'సేవే ఆరాధన' అనే సంకల్పంతో గౌతమ్ అదానీ కీలక నిర్ణయం తీసుకున్నారు. జూన్ 27 నుండి జూలై 8 వరకు జరిగే రథయాత్రలో యాత్రికులు, ఫ్రంట్‌లైన్ అధికారులకు మద్దతు ఇవ్వడానికి అదానీ గ్రూప్ సమగ్ర సేవా ప్రయత్నాన్ని చేపడుతోందని వర్గాలు తెలిపాయి. ఈ సంవత్సరం పూరి రథయాత్రలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం దాదాపు 4 మిలియన్ల భోజనాలు, పానీయాలు ఉచితంగా పంపిణీ చేయాలని అదానీ గ్రూప్ నిర్ణయించింది. యాత్రికులు, అధికారులకు ఉచిత, పోషకమైన భోజనాన్ని అందించే ఆహార కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఒడిశా వేడిని అధిగమించడానికి కూల్ డ్రిరక్స్ అందించే నగరవ్యాప్తంగా పానీయాల కౌంటర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. పూరి బీచ్ లైఫ్‌గార్డ్ మహాసంఘ నుండి లైఫ్‌గార్డ్‌లకు మద్దతుగా నిలుస్తున్నారు. బీచ్ క్లీనప్ కోసం స్వచ్ఛంద సేవకులను నియమించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, అధికారిక స్వచ్ఛంద సేవకులకు ఉచిత టీషర్టులు, మున్సిపల్ కార్మికులకు ఫ్లోరోసెంట్ సేఫ్టీ వెస్ట్‌లు, అధికారులు, భక్తులకు వివిధ రకాల జాకెట్లు, రెయిన్‌కోట్లు, క్యాప్‌లు, గొడుగులను అదానీ సంస్థ అందజేసింది. ఇది అదానీ గ్రూప్, పూరి జిల్లా అధికార యంత్రాంగం, ఇస్కాన్, స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారం ద్వారా జరుగుతుంది. గ్రామీణ ఆరోగ్య సంరక్షణ, పాఠశాల మౌలిక సదుపాయాలు, జీవనోపాధి వంటి రంగాలలో అదానీ ఫౌండేషన్ ద్వారా ఒడిశాలో పనిచేస్తున్న ఈ బృందం, ఈ సేవను భారతదేశ ప్రజా జీవితంలో పెద్ద ఆధ్యాత్మిక కొనసాగింపులో భాగంగా చూస్తుందని వర్గాలు తెలిపాయి. అదానీ గ్రూప్ కోసం, కార్పొరేట్ సామాజిక బాధ్యత ఎల్లప్పుడూ మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సంరక్షణకు మించి విస్తరించింది. భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక జీవితంలో ప్రత్యక్షంగా చురుకుగా పాల్గొనడం ముఖ్య ఉద్దేశ్యం. స్పాన్సర్‌గా కాకుండా, సేవకుడిగా పని చేయాలని అదానీ ఫౌండేషన్ భావిస్తోంది. ఈ సంవత్సరం ప్రారంభంలో, 45 రోజులపాటు జరిగిన మహా కుంభమేళా సందర్భంగా, అదానీ గ్రూప్ ఇస్కాన్, గీతా ప్రెస్‌తో కలిసి భారీ స్థాయిలో ఆహార పంపిణీ చేపట్టారు. కుంభమేళాకు తరలి వచ్చిన యాత్రికుల సంక్షేమ సేవలకు మద్దతుగా నిలిచారు. ఏడాది జనవరి 21న, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ స్వయంగా కుంభమేళాలో నిర్వహించిన సేవలో పాల్గొన్నారు. సామాజిక సేవ అనేది ఒక ఉపమార్గ కార్యకలాపం కాదు, సామాజిక స్పృహ అనే గ్రూప్ సందేశాన్ని వెల్లడిరచారు. మహా కుంభ్ అనేది ఒక విస్తృత కార్యకలాపం అయితే, రథయాత్ర అనేది సాన్నిహిత్యం గురించి అని వర్గాలు తెలిపాయి. పూరీలో సంఖ్యలు తక్కువగా ఉండవచ్చు. శక్తి తక్కువగా ఉండదు. యాత్రకు తరలి వచ్చే భక్తుల సంఖ్య అత్యధికంగా ఉంటుందని భావిస్తున్నారు. రథయాత్రలో పాల్గొనడం ద్వారా, అదానీ గ్రూప్ సేవలను అందించడం మాత్రమే కాదు, ఇది భారతీయ సంస్కృతి, సమాజం, కరుణపై ఆధారపడిన అభివృద్ధి దృక్పథాన్ని బలోపేతం చేస్తోంది.

# సగం ధరకే మలేరియా వ్యాక్సిన్..




ప్రపంచంలోనే తొలి పిల్లల మలేరియా వ్యాక్సిన్ తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకురానున్నట్లు భారత్ బయోటెక్ ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన ఫార్మా దిగ్గజం 2028 నాటికి వ్యాక్సిన్ ధరను సగానికి పైగా తగ్గిస్తామని ప్రకటించింది. దాంతో వ్యాక్సిన్ రూ.429కే అందుబాటులోకి రానున్నది. భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్, జీఎస్‌కే పీఎల్‌సీ తాము అభివృద్ధి చేస్తున్న ఆర్‌టీఎస్ఎస్ వ్యాక్సిన్‌ను తగ్గిస్తామని ప్రకటించాయి. గతంలో వ్యాక్సిన్ ధర రూ.859కు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ధర కనీసం 60శాతం తగ్గనున్నది. రెండు కంపెనీలు వ్యాక్సిన్ల తయారీ ప్రక్రియను మెరుగుపరచడంతో పాటు ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడం, ఖర్చులను తగ్గించుకొని తక్కువ లాభాల ద్వారా వ్యాక్సిన్‌ను 2028 నాటికి వ్యాక్సిన్‌ను తగ్గిస్తామని రెండు కంపెనీలు ప్రకటించాయి. ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆఫ్రికా, భారత్ వంటి ప్రభావిత దేశాల్లో పిల్లలకు మలేరియా సోకకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ వ్యాక్సిన్లు వేయనున్నారు. వాస్తవానికి ఏటా ఐదులక్షల మందికిపైగా పిల్లలు మలేరియా బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో ఆఫ్రికాలో పిల్లలకు తక్కువ ధరకే మలేరియా వ్యాక్సిన్లు అందించేందుకు వ్యాక్సిన్ అలయన్స్ (గ్లాక్సోస్మిత్‌క్లైన్) గవి అనే స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోంది. ఈ సంస్థకు జీఎస్‌కే వ్యాక్సిన్లు సరఫరా చేస్తూ వస్తున్నది. ఈ సందర్భంగా భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా మాట్లాడుతూ.. జీఎస్‌కే, పాత్ తదితర ఫార్మా కంపెనీలు కలిసి ఆర్‌టీఎస్ఎస్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఈ వ్యాక్సిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం లభించిందని.. జేఎస్‌కే ఈ వ్యాక్సిన్ టెక్నాలజీని భారత్ బయోటెక్‌కు బదిలీ చేసిందని చెప్పారు. వ్యాక్సిన్‌ను తయారు చేసేందుకు గవికి సరఫరా చేసేందుకు 2021లోనే ఒప్పందం కుదిరిందన్నారు. వ్యాక్సిన్ల తయారీ, అభివృద్ధి కోసం భారత్ బయోటెక్ 200 మిలియన్ల పెట్టుబడి పెట్టిందన్నారు. చారిత్రాత్మక ప్రకటన ద్వారా కోట్లాది మంది పిల్లలు, కుటుంబాలను మలేరియా భూతం నుంచి కాపాడబోతున్నామన్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, ప్రక్రియ మెరుగుదలలు, చౌకైన తయారీ పద్ధతులు, కనీస లాభ విధానం ద్వారా ఈ ధర తగ్గింపు సాధ్యమైంది. మలేరియాను ఎదుర్కోవడానికి శాశ్వత పరిష్కారాన్ని కనుగొనడానికి 2021 నుంచి భారత్ బయోటెక్‌తో కలిసి పనిచేస్తున్నామని జీఎస్‌కే చీఫ్ గ్లోబల్ హెల్త్ ఆఫీసర్ థామస్ బ్రూయర్ అన్నారు.


# 10 లక్షల కోట్లు.. స్టాక్ మార్కెట్ల వరుస లాభాలతో పెరిగిన మదుపరుల సంపద



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజూ లాభాల్లో ముగిశాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు మధ్య తూర్పు దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టడం సూచీలకు కలిసొచ్చింది. దీంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా బలపడటం కూడా ర్యాలీకి దోహదం చేశాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజూ లాభాల్లో ముగిశాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు మధ్య తూర్పు దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టడం సూచీలకు కలిసొచ్చింది. దీంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా బలపడటం కూడా ర్యాలీకి దోహదం చేశాయి. లాభాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా ఎగిసిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తిరిగి 83 వేల మైలురాయిని అధిగమించింది. మార్కెట్ ముగిసే సమయానికి 1,000.36 పాయింట్లు లేదా 1.21 శాతం అందుకొని 83,755.87 పాయింట్లకు చేరుకున్నది. మరోసూచి నిఫ్టీ 304.25 పాయింట్లు లేదా 1.21 శాతం ఎగబాకి 25,549 పాయింట్లకు చేరుకున్నది. వరుసగా మూడు రోజులుగా సూచీలు కదంతొక్కడంతో మదుపరులు రూ.9.70 లక్షల కోట్ల వరకు సంపదను పోగేశారు. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 1,859.08 పాయింట్లు లేదా 2.27 శాతం లాభపడిరది. దీంతో బీఎస్‌ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.9,70,200.71 కోట్లు పెరిగి రూ.4, 57,52,700.57 కోట్లకు చేరుకున్నది.

# ఇకపై ద్విచక్ర వాహనాలకూ టోల్ ఫీజు.. త్వరలో ప్రకటన..?

జాతీయ రహదారులపై ఇప్పటి వరకూ ద్విచక్ర వాహనాలకు టోల్ నుంచి మినహాయింపు ఇస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇకపై టూవీలర్స్ కూడా టోల్ కట్టాల్సి ఉంటుందట. ద్విచక్ర వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు చేయాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. జాతీయ రహదారులపై ఇప్పటి వరకూ ఫోర్ వీలర్స్, ఇతర పెద్ద వాహనాలకు మాత్రమే టోల్ ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాల ఆటోలు టోల్ కట్టకుండానే జాతీయ రహదారులపై ప్రయాణిస్తున్నాయి. అయితే, ఈ విధానంలో మార్పునకు కేంద్రం శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. వచ్చే నెల అంటే జులై 15 నుంచి జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు టోల్ వసూలు చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. అయితే, దీనిపై అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. త్వరలోనే ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని జాతీయ మీడియా పేర్కొంది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటే ద్విచక్ర వాహనదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉంది.




# రామ్ చరణ్ చేతికి ఆ కట్టు ఏంటి..

ప్రపంచ అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో రామ్ చరణ్, విజయ్ దేవరకొండ గెస్ట్‌లుగా హాజరయ్యారు. మాదకద్రవ్యాల నివారణ పోరాటంలో అందరం ఐక్యంగా నిలబడాలని వాటిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు ఒక సైనికుడిలా పోరాడాలంటూ పిలుపునిచ్చారు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్. అయితే కార్యక్రమం చివర్లో అందరూ డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రమాణం చేశారు. ఈ సమయంలో రామ్ చరణ్ కొద్దిగా అసౌకర్యంగా ఉన్నట్టు వీడియోల్లో కనిపించింది. ముఖ్యంగా ఆయన చేతికి ఉన్న కట్టు అభిమానులను ఆందోళనకు గురిచేసింది. వీడియో నెట్టింట్లో వైరల్ కావడంతో, రామ్ చరణ్‌కు ఏమైంది? ఎందుకు బ్యాండేజ్ కట్టుకున్నారు? అనే సందేహాలు అభిమానులలో ఊపందుకున్నాయి. కొంతమంది ఈ గాయం 'పెద్ది' సినిమా షూటింగ్ సమయంలో తలెత్తిందని భావిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు రామ్ చరణ్ గాయం గురించి అధికారికంగా ఏ సమాచారం వెలువడలేదు. అయితే గాయం అంత తీవ్రమైందిగా కనిపించడం లేదు. 'గేమ్ ఛేంజర్' చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో కొంత నిరాశకి



గురైన రామ్ చరణ్ ప్రస్తుతం 'పెద్ది' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాను షెడ్యూల్‌కు అనుగుణంగా పూర్తి చేసి విడుదల చేయాలనే లక్ష్యంతో కష్టపడుతున్నాడు. 'ఉప్పెన' దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేంద్ర తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పింది.రంగస్థలం రేంజ్‌లో మూవీ హిట్ అవుతుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# నిధి అగర్వాల్‌కు వింత అలవాటు..

టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న హీరోయిన్ నిధి అగర్వాల్. ఇప్పటివరకు నటించిన సినిమాలన్నీ అట్టర్ ప్లాప్ అయ్యాయి. కేవలం ఇస్మార్ట్ శంకర్ సినిమా మాత్రమే బాక్సాఫీస్ వద్ద మెప్పించింది. అయినప్పటికీ ఈ బ్యూటీకి వరుస స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు వస్తున్నాయి. తాజాగా తన లైఫ్ స్టైల్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. ఇంతకీ ఏం చెప్పిందంటే.. టాలీవుడ్ ఇండస్ట్రీలో ప్రస్తుతం బిజీగా ఉన్న హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. కెరీర్ మొదటి నుంచి ఈ అమ్మడు నటించిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద అంతగా ఆకట్టుకోలేకపోయాయి. కానీ రామ్ పోతినేని సరసన ఈ బ్యూటీ నటించిన ఇస్మార్ట్ శంకర్ సినిమా మాత్రమే హిట్టయ్యింది. ఆ తర్వాత తమిళంలో పలు చిత్రాల్లో నటించినప్పటికీ సరైన బ్రేక్ రాలేదు. కానీ ఇప్పుడు ఈ అమ్మడు వరుసగా అగ్ర హీరోల సినిమాల్లో ఛాన్సులు కొట్టేసింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ జోడిగా రాజాసాబ్ చిత్రంలో నటిస్తుంది. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన హరి హర వీరమల్లు చిత్రంలో నటిస్తుంది. ఈ రెండు సినిమాలు త్వరలోనే అడియన్స్ ముందుకు రానుంది. కానీ ఇప్పుడు ఈ అమ్మడు వరుసగా అగ్ర హీరోల సినిమాల్లో ఛాన్సులు కొట్టేసింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ జోడిగా రాజాసాబ్ చిత్రంలో నటిస్తుంది. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన హరి హర వీరమల్లు చిత్రంలో నటిస్తుంది. ఈ రెండు సినిమాలు త్వరలోనే అడియన్స్ ముందుకు రానుంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఈ అమ్మడు ఫుల్ యాక్టివ్. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటుంది. తాజాగా తన ఫాలోవర్లతో చిట్ చాట్ నిర్వహించింది. ఈ క్రమంలోనే తనకు ప్రతి రోజూ రాత్రి మర్డర్ మిస్టరీ సినిమాను చూస్తానని.. కొత్త కంటెంట్ దొరకడం లేదని.. ప్లీజ్ తనకు కొన్ని సూచనలు ఇవ్వండి అంటూ రాసుకొచ్చింది. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఈ అమ్మడు

ఫుల్ యాక్టివ్. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటుంది. తాజాగా తన ఫాలోవర్లతో చిట్ చాట్ నిర్వహించింది. ఈ క్రమంలోనే తనకు ప్రతి రోజూ రాత్రి మర్డర్ మిస్టరీ సినిమాను చూస్తానని.. కొత్త కంటెంట్ దొరకడం లేదని.. ప్లీజ్ తనకు కొన్ని సూచనలు ఇవ్వండి అంటూ రాసుకొచ్చింది. మర్డర్ మిస్టరీ సినిమా ఏ భాష అయిన సరే చేస్తానని తన ట్విట్టర్ ఖాతాలో రాసుకొచ్చింది. దీంతో ప్రస్తుతం ఈ అమ్మడు షేర్ చేసిన ట్వీట్ నెట్టింట వైరలవుతుండగా.. నెటిజన్స్ క్రేజీగా రియాక్ట్ అవుతున్నారు. తెలుగులో ఇటీవల విడుదలైన సినిమాలు చూడాలన చెబుతున్నారు. ఇటీవల నిజ జీవితంలో జరిగిన మేఘాల హనీమూన్ కేసు, తేజేశ్వర్ మర్డర్ కేసు గురించి చదవాలంటూ కామెంట్స్ చేస్తున్నారు. మర్డర్ మిస్టరీ సినిమా ఏ భాష అయిన సరే చేస్తానని తన ట్విట్టర్ ఖాతాలో రాసుకొచ్చింది. దీంతో ప్రస్తుతం ఈ అమ్మడు షేర్ చేసిన ట్వీట్ నెట్టింట వైరలవుతుండగా.. నెటిజన్స్ క్రేజీగా రియాక్ట్ అవుతున్నారు. తెలుగులో ఇటీవల విడుదలైన సినిమాలు చూడాలన చెబుతున్నారు. ఇటీవల నిజ జీవితంలో జరిగిన మేఘాల హనీమూన్ కేసు, తేజేశ్వర్ మర్డర్ కేసు గురించి చదవాలంటూ కామెంట్స్ చేస్తున్నారు. నిధి అగర్వాల్.. ఇప్పుడు సరైన బ్రేక్ కోసం వెయిట్

చేస్తుంది. ఇప్పటివరకు ఈ అమ్మడు నటించిన చిత్రాలన్ని బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. దీంతో ఈ బ్యూటీ ఆశలన్నీ ఇప్పుడు రాజాసాబ్, హరిహర వీరమల్లు సినిమాలపైనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. నిధి అగర్వాల్.. ఇప్పుడు సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తుంది. ఇప్పటివరకు ఈ అమ్మడు నటించిన చిత్రాలన్ని బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. దీంతో ఈ బ్యూటీ ఆశలన్నీ ఇప్పుడు రాజాసాబ్, హరిహర వీరమల్లు సినిమాలపైనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే.



# కన్నప్ప మూవీ రివ్యూ





మహాశివభక్తుడైన కన్నప్ప కథతో ఇండియాలో మొత్తం అయిదారు సినిమాలొచ్చాయి. వాటిలో తెలుగులో శ్రీకాళహస్తి మహత్యం, భక్తకన్నప్ప సినిమాలు బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. మహాశివభక్తుడైన కన్నప్ప కథతో ఇండియాలో మొత్తం అయిదారు సినిమాలొచ్చాయి. వాటిలో తెలుగులో శ్రీకాళహస్తి మహత్యం, భక్తకన్నప్ప సినిమాలు బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. తెలుగు ప్రేక్షకులు కన్నప్ప పాత్రలో కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్‌నీ, రెబల్‌స్టార్ కృష్ణంరాజునీ చూశారు. బ్రహ్మరథం పట్టారు కూడా. అంతటి మహానటులు చేసిన పాత్రను, అంతటి విజయాలను అందుకున్న కథను మళ్లీ చేయడం, మళ్లీ తీయడమంటే అది నిజంగా సాహసమే. ఆ సాహసమే మంచు ఫ్యామిలీ చేసింది. ఈ సినిమా ప్రకటన వచ్చిన నాటి నుంచి సినిమాపై సోషల్ మీడియాలో రకరకాల కామెంట్లు.. అవహేళనలు. ఈ శల్యపరీక్షలన్నింటినీ ఎదుర్కొంటూ ఎట్టకేలకు తెలుగులో మూడోసారి 'కన్నప్ప' కథ ఈ శుక్రవారం తెరమీదకు వచ్చింది. మరి ఈ భక్తిరసాత్మకమైన కథ మళ్లీ దృశ్యకావ్యంగా జనాన్ని మెప్పించిందా? లేక అవహేళనల్ని నిజం చేసిందా? ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలంటే ముందు కథలోకి వెళ్లాలి.

కథ : ఇది దాదాపు అందరికీ తెలిసిన కథే. బోయవాడైన తిన్నడు(మంచు విష్ణు)కి చిన్నప్పట్నుంచీ దేవుడంటే గిట్టదు. మూఢ విశ్వాసాలను తిన్నడు అస్సలు ఉపేక్షించడు. మహావీరుడుగా పెరుగుతాడు. స్వశక్తినే నమ్ముతాడు. ఒకానొక సందర్భంలో గూడెం పెద్దల నిర్ణయాన్ని తిన్నడు ప్రశ్నిస్తాడు. దాంతో గూడెం నుంచి తిన్నడు బహిష్కరించబడతాడు. తిన్నడిని మనసారా ప్రేమించిన నెమలి(ప్రీతి ముకుందన్) కూడా అయినవారందర్నీ వదిలి తిన్నడిని అనుసరిస్తుంది. శివభక్తురాలైన నెమలికి అడవిలో ఎక్కడో అజ్ఞాతంలో ఉన్న పంచభూతాత్మకమైన వాయులింగాన్ని చూడాలని కోరిక. ఎప్పుడూ నిరంతరం శివధ్యానంలోనే ఉంటుంది తను. నెమలి అలా నిత్యం శివధ్యానంలో ఉండటం తిన్నడికి నచ్చదు. మరోవైపు అజ్ఞాతంలో ఉన్న ఆ వాయులింగాన్ని మహదేవశాస్త్రి పరులకంట పడనీయకుండా రహస్యంగా పూజిస్తుంటాడు. సృష్టిస్థితిలయ కారుడైన ఈశ్వరుడి ప్రతిరూపమైన ఆ వాయులింగం తనకు మాత్రమే సొంతం అనేలా ప్రవర్తిస్తుంటాడు మహదేవశాస్త్రి. ఓ మహాశివరాత్రి పర్వదినాన భార్య నెమలితో గొడవ పడ్డ తిన్నడు, వేటకని అడవికి బయలుదేరతాడు. కానీ శివాజ్ఞ లేకపోవడంతో అతనికి వేట దొరకదు. ఆ తర్వాత ఓ అద్భుతం జరుగుతుంది. ఏమిటా అద్భుతం? తిన్నడు కన్నప్పగా ఎలా మారాడు? ఈశ్వరుడు వాయులింగంగా ప్రపంచానికి ఎలా సాక్షాత్కరించాడు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే మిగతా కథ. ఇప్పటివరకూ వచ్చిన రెండు కన్నప్ప కథలకూ ఈ కథకూ కొంత తేడా ఉంది. ఇప్పటివరకూ వచ్చిన రెండు కథలు ధూర్జటిమహాకవి రాసిన 'శ్రీకాళహస్తీశ్వరమహత్మ్యం' కావ్యం ఆధారంగా తీసినవి కాగా, ఈ కన్నప్ప మాత్రం శ్రీకాళహస్తి స్థల పురాణం ఆధారంగా తీసిన కథ. అందువల్లే గత చిత్రాల్లో కనిపించిన కొన్ని పాత్రలు ఈ సినిమాలో కనిపించవ్. దక్షిణభారతానికి చెందిన ఓ మహాపుణ్యక్షేత్రానికి చెందిన ఈ కథను ఉత్తరాదివాడైన దర్శకుడు ముఖేష్‌కుమార్‌సింగ్ అద్భుతంగా అర్థం చేసుకొని తెరకెక్కించాడనిపిస్తుంది. ఓ కొత్త సినేరియాను ఆయన తెరపై చూపించారు. మాస్ ప్రేక్షకుల్ని దృష్టిలో పెట్టుకొని ప్రథమార్ధం హీరోయిజాన్ని ఎలివేట్ చేస్తూ.. భారీ యుద్ధ సన్నివేశాలతో కథను నడిపించాడు. మరోవైపు హీరోహీరోయిన్ల రొమాంటిక్ సన్నివేశాలతో మురిపించాడు. ఇక ద్వితీయార్ధం తిన్నడు కన్నప్పగా మారే క్రమాన్ని మాత్రం అద్భుతంగా తెరపై ఆవిష్కరించాడు. అసలు మంచు విష్ణు నుంచి అలాంటి నటనను ఎవరూ ఎక్స్‌పెక్ట్ చేసుండరు. అందరి అంచనాలనూ తారుమారు చేస్తూ చాలా గొప్పగా నటించాడు విష్ణు. నాస్తికుడిగా, మహాభక్తునిగా, మరోవైపు అర్జునుడిగా ఇలా రకరకాల షేడ్స్‌తో మెప్పించారు విష్ణు. ఈ సినిమాలో కైలాసం ఎపిసోడ్స్ మాత్రం కాస్త వీక్‌గా అనిపిస్తాయి. అక్షయ్‌కుమార్, కాజల్ ఉత్తరాది శివపార్వతులుగా కనిపించడం వల్ల, ఆ సన్నివేశాలు వచ్చినప్పుడు ఏదో హిందీ టీవీ సీరియల్ చూస్తున్న ఫీల్ కలుగుతుంది. ఇక ఇందులో మోహన్‌లాల్, ప్రభాస్ పోషించిన ప్రత్యేక పాత్రలను దర్శకుడు చక్కగా మలిచాడు. ముఖ్యంగా చివరి 40 నిమిషాలు ఈ సినిమా నెక్స్ట్ లెవల్‌లో ఉంది. తిన్నడికి శివుడ్ని తెలియజేసేందుకు కైలాసం నుంచి రుద్రుడు ఎప్పుడైతే దిగాడో అక్కడ్నుంచి కథ ఉత్కంఠకు లోను చేసింది. ప్రేక్షకుల్ని కూడా భక్తిపారవశ్యుల్ని చేసింది. కొన్ని సన్నివేశాలైతే గుజ్‌బప్స్ తెప్పించాయి.

**ఎవరెవరు ఎలా చేశారు?**

కన్నప్పగా, తిన్నడిగా, అర్జునుడిగా.. ఇందులో మూడు రకాలుగా కనిపించాడు మంచు విష్ణు. ఎవరూ ఊహించని విధంగా అందరి అంచనాలనూ తారమారు చేసి అద్భుతంగా నటించాడు. ముఖ్యంగా చివరి 40 నిమిషాలు మంచు విష్ణు నటన అద్భుతం. ఈ సినిమాలో విష్ణు తర్వాత చెప్పుకోవాల్సిన పాత్ర ప్రభాస్. ఆయన పాత్ర నిడివి ఓ 40 నిమిషాలుండొచ్చు. ఆ కొద్ది సమయంలోనే సినిమాకు ప్రాణం పోసేశారు ప్రభాస్. సినిమా విజయానికి బలమైన బాటలు వేశారు. రుద్రుడిగా ఆయన నటన కొన్నేళ్లు గుర్తుండిపోతుంది. ఒక సందర్భంలో శివుడిగా కూడా ప్రభాసే చేస్తే బావుండేది కదా.. అనే భావన కూడా ఆడియన్స్‌కి కలుగుతుంది. ఇక మోహన్‌లాల్ పాత్ర చాలా చిన్నది. కిరాతకార్జునీయం ఎపిసోడ్‌లో శివుడిగా మోహన్‌లాల్, అర్జునుడిగా మంచు విష్ణు కనిపిస్తారు. ఇంట్రవెల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే ఈ ఎపిసోడ్ సినిమా హైలైట్స్‌లో ఒకటి. మోహన్‌లాల్ ఎప్పటిలాగే తనదైన శైలిలో అదరహో అనిపించారు. ఇక మహదేవశాస్త్రిగా మోహన్‌బాబు జీవించారు. మొత్తంగా సినిమాలో నటించినవారంతా పరిధిమేర రక్తికట్టించారు. కథకు అవసరంలేని, అసహనం కలిగించే పాత్రల్ని బ్రహ్మానందం, సప్తగిరి పోషించారు. టెక్నికల్‌గా... దర్శకుడు ముఖేష్‌కుమార్‌సింగ్ దర్శకత్వ ప్రతిభ ఈ సినిమాలో అడుగడుగునా కనిపించింది. ముఖ్యంగా చివరి 40 నిమిషాలు ఆయన ఓ అద్భుతాన్నే ఆవిష్కరించారు. ప్రేక్షకుల్ని భక్తిపారశ్యుల్ని చేశారు. ఏదేమైనా ఈ సినిమా యుద్ధ సన్నివేశాలు కాస్త వీక్‌గానే అనిపిస్తాయి. ఫైట్ల విషయంలో కాస్త జాగ్రత్త పడితే బావుండేది. ఇక ఈ సినిమా కెమెరా వర్క్ సూపర్. ప్రతి ఫ్రేమ్‌నీ ఓ పెయింటిగ్‌లా మలిచారు డీవోపీ షెల్డన్. వాయులింగం డిజైన్ కూడా చాలా బావుంది. ఈ విషయంలో కళా దర్శకుడ్ని అభినందించాలి. ఇక ఈ సినిమాలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది మ్యూజిక్. స్టీఫెన్ దేవస్సీ సంగీతం ఈ సినిమాకు ప్రధాన బలం. ఆయనిచ్చిన నేపథ్య సంగీతం సన్నివేశాలకు ప్రాణం పోసింది. ముఖ్యంగా చివరి 40 నిమిషాలు నేపథ్యసంగీతంతో ఆడియన్స్‌ని రోమాంచితుల్ని చేశారాయన. అన్ని పాటలూ బావున్నాయి.

చివరిగా చెప్పొచ్చేదేంటంటే.. ఈ రోజుల్లో ఇలాంటి సినిమా చేయడం ఓ సాహసం. నేటి తరానికి ఈ కథను చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సినిమా చూస్తున్నంతసేపు చారిత్రాత్మకంగా కొన్ని ప్రశ్నలు ఉత్పన్నమయినా.. జనరంజకంగా సినిమాను మలిచే క్రమంలో దర్శకుడు ఆ మాత్రం సినిమాటిక్ లిబరిటీ తీసుకోవడం తప్పేం కాదు. మొత్తంగా అందరూ చూడాల్సిన సినిమా 'కన్నప్ప'

బలాలు : కథ, కథనం, సంగీతం, కెమెరా, పాత్రధారులు నటన..

బలహీనతలు : కైలాసం ఎపిసోడ్స్, బ్రహ్మానందం కామెడీ సీన్స్, ప్రథమార్ధం కాస్త స్లో నేరేషన్..

# బ్లాక్ బస్టర్స్ అయినా అవకాశాలకు దూరం..

ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్టుగా టాలీవుడ్ సినీప్రియులను అలరించింది. తెలుగులో ఎన్నో సినిమాల్లో బాలనటిగా కనిపించి మెప్పించింది. తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత చదువుల కోసం సినిమాలకు దూరమైన ఈ అమ్మడు..ఇప్పుడు హీరోయిన్‌గా బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంది. కానీ ఈ బ్యూటీకి అదృష్టం మాత్రం కలిసిరావడం లేదు. ఇంతకీ ఆమె ఎవరంటే..టాలీవుడ్ సినీప్రియులకు పెద్దగా అవసరంలేని పేరు. చిన్నప్పుడు చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అగ్ర హీరోల సినిమాల్లో బాలనటిగా కనిపించింది. ఎన్నో సినిమాల్లో తనదైన నటనతో అలరించింది. ఆ తర్వాత చదువుల కోసం ఇండస్ట్రీకి దూరమైన ఈ అమ్మడు.. ఇప్పుడు కథానాయికగానూ సత్తా చాటింది. చాలా కాలం తర్వాత హీరోయిన్‌గా తెరంగేట్రం చేసిన ఈ ముద్దుగుమ్మ.. మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకుంది. టాలీవుడ్ సినీప్రియులకు పెద్దగా అవసరంలేని పేరు. చిన్నప్పుడు చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అగ్ర హీరోల సినిమాల్లో బాలనటిగా కనిపించింది. ఎన్నో సినిమాల్లో తనదైన నటనతో అలరించింది. ఆ తర్వాత చదువుల కోసం ఇండస్ట్రీకి దూరమైన ఈ అమ్మడు.. ఇప్పుడు కథానాయికగానూ సత్తా చాటింది. చాలా కాలం తర్వాత హీరోయిన్?గా తెరంగేట్రం చేసిన ఈ ముద్దుగుమ్మ.. మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు అందుకుంటూ కథానాయికగా మెప్పించింది. తక్కువ సమయంలోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్న ఈ బ్యూటీ నటించిన సినిమాలన్నీ సూపర్ హిట్స్ అయ్యాయి. అయినప్పటికీ నెమ్మదిగా ఈ అమ్మడుకు అవకాశాలు తగ్గిపోయాయి.ఇంతకీ ఈ వయ్యారి ఎవరో తెలుసా.. ? తనే హీరోయిన్ కావ్య కళ్యాణ్ రామ్. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు అందుకుంటూ కథానాయికగా మెప్పించింది. తక్కువ సమయంలోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్న ఈ బ్యూటీ నటించిన సినిమాలన్నీ సూపర్ హిట్స్ అయ్యాయి. అయినప్పటికీ నెమ్మదిగా ఈ అమ్మడుకు అవకాశాలు తగ్గిపోయాయి.ఇంతకీ ఈ వయ్యారి ఎవరో తెలుసా.. ? తనే హీరోయిన్ కావ్య కళ్యాణ్ రామ్. చైల్డ్ ఆర్టిస్టుగా దాదాపు పదకొండు సినిమాల్లో నటించింది. అల్లు అర్జున్ హీరోగా నటించిన గంగోత్రి సినిమాతో గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత మసూద సినిమాతో కథానాయికగా తెరంగేట్రం చేసింది. మొదటి సినిమాతోనే నటిగా ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా తర్వాత వేణు దర్శకత్వం వహించిన బలగం సినిమాతో మరో సక్సెస్ అందుకుంది. చైల్డ్ ఆర్టిస్టుగా దాదాపు పదకొండు సినిమాల్లో నటించింది. అల్లు అర్జున్ హీరోగా నటించిన గంగోత్రి సినిమాతో గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత మసూద సినిమాతో కథానాయికగా తెరంగేట్రం చేసింది. మొదటి సినిమాతోనే నటిగా ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా తర్వాత వేణు దర్శకత్వం వహించిన బలగం సినిమాతో మరో సక్సెస్ అందుకుంది. ఆ తర్వాత పలు సినిమాల్లో కనిపించింది. శ్రీసింహా నటించిన ఉస్తాద్ సినిమాతో మరోసారి అడియన్స్ ముందుకు వచ్చింది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. ఆ తర్వాత మరో సినిమా రాలేదు. ఆమె సినిమా చేసి దాదాపు రెండేళ్లవుతుంది. అయితే ఈ అమ్మడుకు తెలుగులో అవకాశాలు తగ్గిపోయినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత పలు సినిమాల్లో కనిపించింది. శ్రీసింహా నటించిన ఉస్తాద్ సినిమాతో మరోసారి అడియన్స్ ముందుకు వచ్చింది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. ఆ తర్వాత మరో సినిమా రాలేదు. ఆమె సినిమా చేసి దాదాపు రెండేళ్లవుతుంది. అయితే ఈ అమ్మడుకు తెలుగులో అవకాశాలు తగ్గిపోయినట్లు తెలుస్తోంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది కావ్య కళ్యాణ్ రామ్. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంటుంది. అటు చీరకట్టులో.. ఇటు మోడ్రన్ డ్రెస్సులలో గ్లామర్ ఫోజులతో నెటిజన్లను ఆకట్టుకుంటుంది. తాజాగా కావ్య కళ్యాణ్ రామ్ క్రేజీ ఫోటోస్ సోషల్ మీడియాలో తెగ వైరలవుతున్నాయి . కానీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది కావ్య కళ్యాణ్ రామ్. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంటుంది.

అటు చీరకట్టులో.. ఇటు మోడ్రన్ డ్రెస్సులలో గ్లామర్ ఫోజులతో నెటిజన్లను ఆకట్టుకుంటుంది. తాజాగా కావ్య కళ్యాణ్ రామ్ క్రేజీ ఫోటోస్ సోషల్ మీడియాలో తెగ వైరలవుతున్నాయి.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ప్లేయర్స్ రూమ్‌కు గర్ల్‌ఫ్రెండ్‌ను తీసుకువచ్చిన శిఖర్ ధావన్

ఇండియా ఏ జట్టుతో 2006లో ఆస్ట్రేలియాలో టూర్ చేస్తున్న సమయంలో.. ప్లేయర్స్ రూమ్‌కు గర్ల్‌ఫ్రెండ్‌ను తీసుకువచ్చినట్లు శిఖర్ ధావన్ చెప్పాడు. తన ఆటోబయోగ్రఫీలో ఈ విషయాన్ని తెలిపాడు. తాజాగా ఆ బుక్ రిలీజైన విషయం తెలిసిందే. ఫీల్డ్‌లో ఎప్పుడూ సరదాగా ఉండే ఆ క్రికెటర్.. ఎలా తన రూమ్‌కు ఇష్టపడిన అమ్మాయిని తీసుకువచ్చాడో వెల్లడిరచాడు. రోహిత్ శర్మతో రూమ్ షేర్ చేసుకున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఆస్ట్రేలియా టూర్ సమయంలో ఓ అమ్మాయితో ధావన్ ప్రేమాయణం సాగించాడు. అయితే క్రీజ్‌లో లేనప్పుడు రూమ్‌కు ఆ అమ్మాయిని తీసుకువచ్చేవాడు. ఆ టైంలో రోహిత్ శర్మ కొంత ఇబ్బందికి గురయ్యేవాడట. నిద్ర పోనివ్వవా అంటూ రోహిత్ ఆగ్రహానికి గురయ్యేవాడని శిఖర్ తన బుక్‌లో రాశాడు. డేటింగ్ రిలేషన్ గురించి టీమ్‌లో అందరికీ తెలిసిపోయిందని, దాంట్లో జట్టు సభ్యులు ఆమెను చూసేందుకు వచ్చేవారన్నాడు. చాలా అందంగా ఉంటుందని, సడెన్‌గా లవ్‌లో పడిపోయానని, తాను నా కోసమే పుట్టిందన్న భావన వచ్చిందని, పెళ్లి చేసుకోవాలన్న ఆలోచనలో ఉన్నట్లు కూడా ధావన్ తెలిపాడు. ప్రతి రోజు మ్యాచ్ ముగిసిన తర్వాత ఆ అమ్మాయి వద్దకు వెళ్లి కలిసేవాడినని, ఓ రోజు డిన్నర్‌కు వెళ్తున్న సమయంలో ఆమె రూమ్‌కు వచ్చిన విషయాన్ని తెలుసుకున్న జట్టు సభ్యులు తన వెంటపడినట్లు ధావన్ తెలిపాడు. చేతుల్లో చేయి వేసి నడుస్తున్న సమయంలో.. సీనియర్ సెలెక్టర్ కూడా ఇద్దర్నీ చూసేసినట్లు గుర్తు చేశాడు. ఇండియా తరపున ధావన్ 34 టెస్టులు, 167 వన్డేలు, 68 టీ20లు ఆడాడు. వన్డేల్లో ధావన్ 44 సగటుతో 6793 రన్స్ చేశాడు. దాంట్లో 17 సెంచరీలు, 39 ఫిఫ్టీలు ఉన్నాయి. టెస్టుల్లో అతను 2315 రన్స్ చేశాడు. ఏడు సెంచరీలు, 5 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.



ఏషియన్ స్క్వాష్ డబుల్స్ చాంపియన్‌షిప్స్‌లో

# మూడు స్వర్ణాలు

మలేషియాలో జరిగిన రెండో ఏషియన్ స్క్వాష్ డబుల్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ అదరగొట్టింది. మూడింటికి మూడు విభాగాల్లోనూ స్వర్ణాలు గెలిచి క్లీన్‌స్వీప్ చేసింది. గురువారం జరిగిన ఫైనల్స్ పోటీలలో పురుషుల, మహిళల, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో భారత ఆటగాళ్లు ప్రత్యర్థులను చిత్తుచేసి పసిడి ప్రదర్శనలు నమోదుచేశారు. పురుషుల డబుల్స్‌లో టాప్ సీడ్ ద్వయం అభయ్ సింగ్‌వెలవన్ సెంథిల్‌కుమార్.. 21 (911, 115, 115)తో పాకిస్థాన్ జోడీ నూర్ జమన్‌నాసిర్ ఇక్బాల్‌ను ఓడిరచింది. తొలి సెట్ కోల్పోయినప్పటికీ తర్వాత పుంజుకున్న భారత జోడీ.. వరుస సెట్లతో పాక్ ఆటగాళ్లను చిత్తుచేసింది. ఆ తర్వాత జరిగిన మహిళల డబుల్స్‌లో సీనియర్ ప్లేయర్ జ్యోత్స్న చిన్నప్ప.. 17 ఏండ్ల అమ్మాయి అన్హత్ సింగ్‌తో కలిసి 21 (811, 119, 1110)తో అమనిజిన్ యింగ్ (మలేషియా) ద్వయాన్ని మట్టికరిపించింది. 35 నిమిషాల్లోనే ఈ పోరు ముగిసింది. ఇక చివరగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో అభయ్‌అన్హత్ జంట.. 20 (119, 117)తో రేచల్ ఆర్నాల్డ్‌అమీషెన్రాజ్ చందరన్ (మలేషియా)పై అలవోక విజయం సాధించారు. అభయ్, అన్హత్ రెండు విభాగాల్లో (పురుషుల, మహిళల డబుల్స్‌లో)నూ స్వర్ణాలు సాధించడం గమనార్హం.



# రెండో టెస్ట్‌కు బుమ్రా దూరం

రెండో టెస్ట్ ముందు భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఉంది. టీమిండియా ఎంతో ఆధారపడిన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా బర్మింగ్‌హామ్ టెస్ట్‌కు దూరమవుతాడన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. తొలి టెస్ట్‌లో మిగతా పేసర్లు విఫలమైనా బుమ్రా ఒంటరి పోరాటం చేశాడు. అయితే, పనిభారం నిర్వహణలో భాగంగా బర్మింగ్‌హామ్ టెస్ట్‌కు బుమ్రాకు విశ్రాంతినివ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు సమాచారం. దీంతో లార్డ్స్‌లో జరిగే మూడో టెస్ట్‌కు అతడు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. అయితే, లీడ్స్‌లో అనూహ్యంగా ఓటమిపాలైన భారత్.. పుంజుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత మాజీ ఆటగాడు రవిశాస్త్రి చెప్పాడు. బుమ్రాకు విశ్రాంతినిస్తే భారత్ 02తో వెనుకబడే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. ‘ఈ సిరీస్‌లో మూడు టెస్టులు మాత్రమే ఆడతానని బుమ్రా చెప్పాడు. కానీ, అవి ఏవేవో చెప్పలేదు. ఒకవేళ రెండో మ్యాచ్‌కు దూరమైతే.. లార్డ్స్ టెస్ట్‌లో కచ్చితంగా ఆడాలనుకొంటాడు. అయితే, బర్మింగ్‌హామ్‌లో బుమ్రా బరిలోకి దిగకపోతే భారత్ 02తో వెనుకబడుతుంది. టీమిండియా పోటీలో ఉండాలంటే మాత్రం బుమ్రా ఆడితీరాల’ని శాస్త్రి చెప్పాడు. ఇంగ్లండ్ బౌలింగ్ బలహీనంగా ఉండడంతో పాటు ఆ టీమ్‌ను గాయాల బెడద వెంటాడుతోందన్నాడు. వీటిని అవకాశాలుగా మలచుకొని భారత్ పంచ్ ఇవ్వాలని సూచించాడు. అలా జరగాలంటే టీమ్‌లో బుమ్రా ఉండాలని అన్నాడు.



# కిరణ్, సూర్య పతక జోరు..

తెలంగాణ షూటింగ్ టోర్నీ గచ్చిబౌలి సాట్స్ షూటింగ్ రేంజ్ వేదికగా జరుగుతున్న 11వ తెలంగాణ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో లైశా కిరణ్, సూర్యకృష్ణ పతక జోరు కనబరిచారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతున్న టోర్నీలో మహిళల విభాగంలో లైశా కిరణ్ ఏడు పతకాలతో సత్తాచాటింది. ప్రత్యర్థి షూటర్లకు దీటైన సవాల్ విసురుతూ పతక ధమాకా కొనసాగించింది. పురుషుల కేటగిరీలో సూర్యకృష్ణ రెండు స్వర్ణాలు సహా ఐదు పతకాలతో ఆకట్టుకున్నాడు. మరోవైపు సంగెం తాన్సి ఏడు పతకాలు, నాగసాయి తరుణ్ నాలుగు స్వర్ణాలు సహా ఐదు పతకాలు, ట్రాప్, డబుల్ ట్రాప్ ఈవెంట్లలో జయగురు సింహ రెండు పసిడి పతకాలు కైవసం చేసుకున్నాడు. గురువారం జరిగిన ముగింపు కార్యక్రమంలో పతక విజేతలను స్పీకర్ ప్రసాద్, టీవోఏ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, టీఆర్ఏ అధ్యక్షుడు అమిత్‌సంఘి అభినందించారు.




# విశాఖ ఇండస్ట్రీస్ కేసులో హెచ్‌సీఏకు ఎదురుదెబ్బ

ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో వ్యాపార ప్రకటనల హక్కులకు సంబంధించి విశాఖ ఇండస్ట్రీసతో జరిగిన ఒప్పందం విషయంలో హైదరాబాద్ క్రికెట్ సంఘానికి (హెచ్‌సీఏ) ఎదురుదెబ్బ తగిలింది. విశాఖ ఇండస్ట్రీస్‌తో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయనందుకు హెచ్‌సీఏ రూ.25 92 కోట్లు చెల్లించాలని, ఈ మొత్తం చెల్లించే వరకు 18 శాతం వడ్డీ లెక్కగట్టాలని అర్బిట్రేషన్ అవార్డు జారీ అయింది. ఈ అవార్డును హెచ్‌సీఏ 2016లో కమర్షియల్ కోర్టులో సవాల్ చేయగా 2024లో కమర్షియల్ కోర్టు హెచ్‌సీఏ పిటిషన్‌ను కొట్టేసింది. కమర్షియల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ హెచ్‌సీఏ హైకోర్టులో అప్పీల్ చేసింది. కాగా హైకోర్టులో సైతం హెచ్‌సీఏకు ఎదురుదెబ్బ తగిలింది. హెచ్‌సీఏకు వ్యతిరేకంగా జారీ అయిన అర్బిట్రేషన్ అవార్డును హైకోర్టు సమర్థించింది. హెచ్‌సీఏ ఏ దశలోనూ న్యాయబద్ధంగా ఆట ఆడలేదని.. కనీసం అవార్డుకు సంబంధించిన చట్టబద్ధమైన సెక్యూరిటీ డిపాజిట్ కూడా చేయలేదని హైకోర్టు తప్పుబట్టింది. హెచ్‌సీఏ క్రీడాస్ఫూర్తిలేని తన అసలు రంగును బయటపెట్టిందని హైకోర్టు వ్యాఖ్యానించింది.






# ఢిల్లీ ఫ్రీస్టయిల్ చెస్‌కు స్పాన్సర్లు కరవు

న్యూఢిల్లీ: స్పాన్సర్లు ముందుకు రాకపోవడంతో భారత్‌లో జరగాల్సిన ప్రతిష్ఠాత్మక ఫ్రీస్టయిల్ చెస్ టోర్నమెంట్ తరలి పోనుంది. ఈ భారత అంచె టోర్నమెంట్ సెప్టెంబరు 17 నుంచి 24 వరకు ఇక్కడ జరగాల్సి ఉంది. కానీ ఈ టోర్నీని స్పాన్సర్ చేసేందుకు దేశంలోని ఏ సంస్థా ముందుకు రాలేదట. దీంతో వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్ ఆటను ప్రత్యక్షంగా చూడాలన్న భారత చెస్ అభిమానులకు నిరాశే మిగలనుంది. వివిధ అంచెలలో నిర్వహించే ఫ్రీస్టయిల్ చెస్ చాంపియన్‌షిపలో..మూడు అంచెలు ముగిశాయి. కార్ల్‌సన్ 65 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి (16) ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. ఢిల్లీలో జరగాల్సింది నాలుగో అంచె టోర్నమెంట్.

## నాలుగేండ్ల తర్వాత జట్టులోకి ఆర్చర్

వచ్చే నెల 2 నుంచి ఎడ్జ్‌బాస్టన్ వేదికగా భారత్‌తో జరగాల్సి ఉన్న రెండో టెస్టుకు ముందు ఇంగ్లండ్ తమ జట్టులో స్వల్ప మార్పులు చేసింది. ఆ జట్టు స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌ను రెండో టెస్టుకు గాను జట్టులోకి తీసుకుంది. నాలుగేండ్ల తర్వాత ఆర్చర్ టెస్టు జట్టులోకి రావడం గమనార్హం. చివరిసారిగా అతడు 2021లో భారత్‌తోనే టెస్టు ఆడాడు. ఆ తర్వాత వరుసగా గాయాలబారిన పడ్డ ఆర్చర్.. ఇటీవలే కౌంటీ చాంపియన్‌షిప్‌లో ససెక్స్ తరఫున ఆడాడు. అయితే తుది జట్టులో ఆర్చర్ ఉంటాడా? లేదా? అన్నది త్వరలో తేలనుంది.



# జాతీయ కబడ్డీ పోటీలకు శిరీష

గద్వాల జిల్లా అయిజ మండలం మేడికొండకు చెందిన విద్యార్థిని శిరీష జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీకి ఎంపికైంది. ఈనెల 28 నుంచి జూలై ఒకటో తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరగనున్న అండర్18 నేషనల్ టోర్నీలో ఆమె తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నది. ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు కబడ్డీ అకాడమీలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చి ఆమె.. జాతీయ టోర్నీకి ఎంపికైంది. రంగారెడ్డి జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఆమె ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. పుష్పావతి, జలపతి వెంకటేశ్‌గౌడ్ దంపతుల కుమార్తె అయిన శిరీష చిన్ననాటి నుంచి క్రీడల్లో ప్రతిభ చాటుతూ గౌలిదొడ్డిలోని సీవోఈలోని అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నది.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in